# ప్రజాశక్తి

సోమవారం 8 సెప్టెంబర్ 2025

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# కార్మికవర్గంపై దాడిని తిప్పికొడతాం

◆ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు ◆ ముగిసిన సంఘం అనకాపల్లి జిల్లా మహాసభ




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

**ప్రజాశక్తి - చోడవరం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడిని తీవ్రతరం చేశాయని, ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. రెండురోజుల పాటు తలపెట్టిన సిఐటియు అనకాపల్లి జిల్లా 13వ మహాసభలు చోడవరంలోని గంగా ఫంక్షన్ హాల్‌లో ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు మహాసభను ఉద్దేశించి ముఖ్య అతిథి ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ పేరిట కార్మిక వర్గాన్ని యజమానులకు బానిసలుగా చేయటానికి చూస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కార్మిక వర్గంపై దాడిని ఎక్కుపెట్టిందని తెలిపారు. ఇప్పటికే పని గంటలు పెంచుతూ కేబినెట్ నిర్ణయం చేయడం, కాంట్రాక్ట్ కార్మికులకు అప్కాస్‌ను రద్దుచేసి ఏజెన్సీలకు అప్పగించపూనుకోవడం దారుణమన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అనకాపల్లి జిల్లాలో కార్మికుల సమస్యలపై ఉవ్వెత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఫార్మా, ఎస్ఇజెడ్‌లో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు దక్కేలా ఉద్యమించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలయ్యేలా పోరాటాలు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా సిఐటియు నిలుస్తోందన్నారు. ఉక్కు ఉద్యమం స్ఫూర్తిదాయకంగా సాగుతోందన్నారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం సమిష్టి పోరాటాలు చేయనున్నామన్నారు.

**28 తీర్మానాలు ఆమోదం**

రెండో రోజు మహాసభలో కార్యదర్శి నివేదికపై 24 మండలాలు, అన్ని రంగాల నుంచి నాయకులు మాట్లాడారు. మహాసభ కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించింది. పలు అంశాలపై 28 తీర్మానాలు చేసింది. వాటి అమలుకు భవిష్యత్తులో ఉద్యమించాలని పిలుపునిచ్చింది. మహాసభల్లో మిగతా 2లో..



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

# ఇఐపిఎల్ ట్యాంకుపై పిడుగు

**భారీగా ఎగిసిన మంటలు**



విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని ఈస్ట్ ఇండియా పెట్రోల్ కంపెనీ లిమిటెడ్ (ఇఐపిఎల్) ట్యాంకుపై ఆదివారం పిడుగుపడింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. పక్కనే హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ కూడా ఉండటంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన అందరినీ వెంటాడింది. హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ అగ్నిమాపక శకటాలు హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపుచేశాయి. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

## 'మేఘాద్రి'లో ఇద్దరు యువకులు మృతి

▶ వార్త 3లో..

## యూరియా సరఫరాలో విఫలం

▶ వార్త 8లో..

## సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ 'రణభేరి'

▶ వార్త 5లో..




గాజువాక ప్రచార ర్యాలీలో పాల్గొన్న జగ్గునాయుడు తదితరులు

# ఇఒఐల పేరిట ఉక్కుపై కుట్ర

**స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 11న గాజువాకలో బహిరంగ సభ**

జయప్రదానికి సిపిఎం విస్తృత ప్రచారం వార్తలు 4లో..

# మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

◆ ఐదు మ్యాచ్‌లు ఇక్కడే.. ◆ ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :**

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుందని ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. ఐసిసి మహిళా ప్రపంచకప్ ట్రోఫీ 2025 టూర్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం విశాఖలోని ఎసిఎ - విడిసిఎ మైదానంలో ఐసిసి మహిళా ప్రపంచకప్ 2025 ట్రోఫీని ప్రదర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో భాగంగా విశాఖపట్నంలో ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయని తెలిపారు. వీటిలో పాల్గొనేందుకు ఇండియాతో పాటు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మహిళా జట్లు విశాఖకు రానున్నాయని తెలిపారు. ప్రపంచ కప్‌లో తొలిసారి ఐదు మ్యాచ్‌లకు విశాఖ వేదిక కావడం గొప్ప విషయమన్నారు. విశాఖ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని



ప్రపంచ కప్ ట్రోఫీతో మహిళా క్రికెటర్లు

పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర మంత్రి లోకేష్ 'బ్రేకింగ్ బౌండరీస్ విత్ నారా లోకేష్' అనే కార్యక్రమం ద్వారా భారత మహిళా జట్టు సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమైన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పది సంవత్సరాల క్రీడా రోడ్ మ్యాప్‌లో స్పోర్ట్స్ కోటా కింద మూడు శాతం ఉద్యోగాలు అందిస్తున్నామని, క్రీడాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా అక్టోబర్ 6న విశాఖ లో జరగనున్న వరల్డ్ కప్ మ్యాచ్‌కు నారా లోకేష్‌ను ఆహ్వానించామన్నారు. రానున్న మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

## కార్మికవర్గంపై దాడిని తిప్పికొడతాం

సంఘం నాయకులు కె.లోకనాథం, జి.కోటేశ్వరరావు, ఆర్.శంకర్‌రావు, వివి.శ్రీనివాసరావు, ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, ఎ.రాజు, గూనూరు వరలక్ష్మి, ప్రేమ చంద్రశేఖర్, ఎస్‌వి.నాయుడు, దుర్గారాణి, కె.వరలక్ష్మి, సత్యవతి, ఆర్.దేముడు నాయుడు పాల్గొన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, వృతిదారుల సంఘం నాయకులు గంటా శ్రీరామ్ తదితరులు సౌహార్ద్ర సందేశాలిచ్చారు.



రిఖిల్ తరుపున విరాళ చెక్కును అందజేస్తున్న భారతి

### అఖిలభారత మహాసభలకు రిఖిల్ విరాళం

సిఐటియు జిల్లా నాయకులు వివి.శ్రీనివాసరావు, భారతిల కుమారుడు రిఖిల్ విశాఖలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభల జయప్రదం కోసం సంఘం అనకాపల్లి జిల్లా కమిటీకి రూ.20 వేలను భూరి విరాళంగా అందజేశాడు. రిఖిల్‌కు ఇటీవల ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఈ విరాళ మొత్తాన్ని ప్రకటించాడు. ఆ చెక్కును రిఖిల్ కుటుంబీకులు ఎవి.నాగేశ్వరరావుకు అందజేశారు. రిఖిల్‌కు అభినందనలు తెలిపారు.

## మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

రోజుల్లో మిథాలీ రాజ్ మెంటర్‌గా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో కలిసి గ్రామీణ, పాఠశాల స్థాయి ఆటగాళ్లకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించేందుకు ఎసిఎ ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా క్రికెట్ క్రీడాకారులు మేఘన, బి.అనూష, స్నేహ దీప్తి, షబ్నం, ఎసిఎ సంయుక్త కార్యదర్శి బి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

**ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :** ఓ మానసిక రోగి కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామానికి చెందిన దేముడు పేదరికం వలన చదువుకోలేదు. చిన్నప్పుడే తల్లి, 2 సంవత్సరాల క్రితం తండ్రి ఇద్దరూ మృతి చెందారు. 10 ఏళ్ళ కిందట బాగా మద్యం సేవించేవాడు. నెమ్మదిగా ఆయన భార్య అలవాటు మాన్పించింది. తండ్రి మృతితో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. రోజూ భార్యతో గొడవ పడటంతో పాటు పనికెళ్ళడం మానేశాడు. బయటకు వెళ్ళినే వెంటనే ఇంటికి వచ్చేసేవాడు. తరువాత ఒకసారి తిరిగివెళ్లి మరిరాలేదు. 4 నెలల క్రితం దేముడు వైజాగ్ రైల్వేస్టేషన్లో ఎయుటిడి సిబ్బందికి పట్టుబడ్డాడు. అతను శ్రద్ధామందుల ద్వారా బాగా కోలుకోవడంతో అతని భార్య సూరమ్మ వివరాలు తెలుసుకుని ఆదివారం అతని క్షేమంగా అప్పగించడం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అతని చెల్లి, భార్య ఆనందంతో ఎయూటిడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.




వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

## ఘనంగా మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ 20 వసంతాల వేడుక

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 20 ఏళ్ల వేడుకలను ఆదివారం విశాఖలో ఘనంగా నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2025లో కేవలం ఆరు పడకల డే-కేర్ సదుపాయంతో ప్రారంభమైన సంస్థ నేడు తూర్పు భారతదేశంలోనే ప్రముఖ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. ఇప్పటివరకూ రెండు లక్షలకు పైగా రోగుల జీవితాలను ప్రభావితం చేసిన ఈ ఆసుపత్రి ముందస్తు నిర్ధారణ, అత్యధిక చికిత్సలు, రిహాబిటేషన్ వంటి విశేషమైన సేవలను అందిస్తోంది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి కేవలం వైద్య సేవలకు మాత్రమే కాకుండా ప్రతిరోగి జీవితాన్ని మెరుగుపరచాలని మానవతా ధృక్పథంతో రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలవాలనే లక్ష్యంతో పనిచేస్తోందని అన్నారు. అదేవిధంగా తమ సంస్థ శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ వంటి ఎన్‌జిఒలతో భాగస్వామ్యమై సామాజికంగా వెనకబడిన వర్గాలకు నాణ్యమైన చికిత్స అందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

# గ్లోబల్ సదస్సుల మోత !

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఇటీవల విశాఖలో రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలో వరుసగా గ్లోబల్ సమ్మిట్లు హోరెత్తుతున్నాయి. వీటిపై తాజాగా చర్చ నడుస్తోంది. వాస్తవానికి విశాఖ అంటేనే పారిశ్రామిక వాడ. ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రం. ఉన్న వాటిని నిలుపుకుంటే చాలా మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కానీ తాజాగా చూస్తే రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, వేల సంఖ్యలో ఉఉద్యోగాలు, ఉపాధి, నేషనల్, ఇంటర్నేషనల్, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్.. ఇలా రకరకాల పేర్లతో ఇక్కడ జరుగుతున్న సదస్సులతో చాలా సంస్థలు విశాఖకు వచ్చేస్తాయన్న ఆశ అందరిలోనూ కలుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ తరహా సదస్సులతో విశాఖ అత్యంత బిజీ నగరంగా మారిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ ఇద్దరూ విశాఖ నగరంపైనే దృష్టిసారించారు. మరోవైపు డిప్యూటీ సిఎం పవన్ కూడా విశాఖ నుంచే తమ పార్టీ సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దుకోడానికి పూనుకున్నారు. ఇలా అన్ని వైపుల నుంచీ విశాఖ నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. నగర ప్రజల అవసరాలైన సరైన రహదారులు, ఆవాస యోగ్యమైన సౌకర్యాలు, నిత్యం ట్రాఫిక్‌తో సతమతమయ్యే ప్రజలకు ఊరటనిచ్చేలాగ కొత్త ఫ్లై ఓవర్ల నిర్మాణం, మెట్రో రైలు, విశాఖ కేంద్రంగా నూతన రైల్వే జోన్ పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. టాటా కంపెనీ వచ్చేస్తుంది... గూగుల్ వచ్చేయబోతుంది.. ప్రైవేట్ మిట్టల్ స్టీల్ వస్తుందంటూ ఊదరగొట్టే ప్రచారాలు ఊపందుకంటున్నాయి తప్ప వాస్తవ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

**మాస్టర్ ప్లాన్ కూడా పెట్టుబడిదార్ల కోసమేనా?**

విశాఖ ప్రజల అవసరాలు, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్న అంశాన్ని పక్కనపెట్టి సరికొత్త మాస్టర్ ప్లాన్‌ను విఎంఆర్‌డిఎ, రెవెన్యూ, ఎపిఐఐసి అధికారులచేత రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేయిస్తోంది. ఈ ప్లాన్‌లన్నీ ఆనందపురం మండలం తర్లువాడలో వందల ఎకరాల భూములను భూ సేకరణ చేయడానికి, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలకు నక్కపల్లిలో వందల ఎకరాలు ధారాదత్తం చేసేందుకే తప్ప




ఏం లాభం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరో వైపు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు ఐదు వేల మంది ఉద్యోగాలను యాజమాన్యం తీసేసినా 'కూటమి' నేతలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరు విశాఖ ప్రజలే కాకుండా యావత్ రాష్ట్ర ప్రజల విమర్శలకు గురౌతోంది.

**తొలినుంచీ అదే విజన్**

2014 నుంచి 2019 మధ్య కాలంలో చంద్రబాబు ఈ రకంగానే సిఐఐ సదస్సులను నిర్వహించి విశాఖపై రూ.లక్షల కోట్లు పెట్టుబడుల కుమ్మరింపుపై లెక్కలు వేసుకున్న సంగతి తెలిసిందే. ఆ కాలంలో విశాఖకు ఒరిగిందేమీ లేదు. ఉపాధి సమకూరలేదు. ఉద్యోగాల్లేవు. ఈ కాకి లెక్కలతోనే ఐదేళ్ల పాలనా ముగిసిపోయింది. గతంలోని అనుభవాలే పునరావృత్తం అయ్యేలా 2025లోనూ పెట్టుబడుల సమ్మిట్‌ల కుమ్మరింపు విశాఖపై కొనసాగుతోంది. అయితే, ఆ పేరుతో భూములను ఆయా సంస్థలకు ధారాదత్తం చేసిన ఘనత చంద్రబాబు కూటమి ప్రభుత్వానిది. సత్వా, ఉర్సా, ఎఎన్ఎస్ఆర్, బివిఎం, సిఫి, టిసిఎస్, ఇన్ఫోసిస్ ఇలా అనేక సంస్థలకు వందల ఎకరాలను రుషికొండపై ఇప్పటికే ప్రభుత్వం భూములను ఇచ్చేసింది. ఆర్‌కె బీచ్‌లో ఇప్పటికే లూలూ మాల్‌కి 13 ఎకరాలను కట్టబెట్టే నిర్ణయం చంద్రబాబు ప్రభుత్వం చేసింది.

విశాఖలో భూముల లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా లేని విధంగా ఇక్కడ భూములను ఏరివేసేందుకు ప్రభుత్వం వ్యూహరచన చేసింది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో గల 1000 ఎకరాల కొండ చుట్టూ భూములపై తాజాగా కన్నేసింది. ఎపిఐఐసిని రంగంలోకి దించి 200 నుంచి 300 ఎకరాలను గూగుల్ సంస్థకు ఇచ్చేసేందుకు రంగం సిద్ధం చేసింది. భూముల ధారాదత్తం చేసేందుకేనా విశాఖపై 'కూటమి' పాలన కేంద్రీకరించింది అనే అనుమానం కలిగేలా ప్రభుత్వ కదలికలు కనిపిస్తున్నాయి.

## కొనసాగుతున్న లూలూ వ్యతిరేక ఉద్యమం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:** లులుమాల్‌కు ఇచ్చిన ప్రభుత్వ స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని విశాఖ ప్రజావనరుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరంలో విస్తృతంగా కరపత్రాల పంపిణి నిర్వహిస్తోంది. ఆదివారం నగరంలోని బీచ్ రోడ్డులో పార్క్ హోటల్ నుండి వేదిక కార్యకర్తలు పెద్ద ఎత్తున లులుమాల్‌కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ఈ సంస్థ వల్ల జరిగే నష్టాలను వివరించారు. వేదిక కన్వీనర్లు డాక్టర్ సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి, ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లులూకి ఇచ్చిన స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆ స్థలంలో సైన్స్ సిటీని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు రవి, అచ్యుతరావు, బాలనాగమ్మ, హేమంత్, బి.రామకృష్ణ, బి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## 19 నుండి 'ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా'

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** షాపింగ్ పరంగా సౌలభ్యానికి సంబంధించి ఇన్‌స్టామార్ట్ తమ ప్రారంభ వార్షిక మెగాసేల్, అత్యంత వేగవంతమైన అమ్మకం అయిన ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి నేస్తాసియా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్లను సైతం అందిస్తుందన్నారు.

## స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:** విశాఖపట్నం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎన్నికల్లో ఎపి ఎఎ స్టేట్ అబ్జర్వర్ రమేష్, డిఎస్ఎ అబ్జర్వర్ పి శైలజ ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దీనిలోభాగంగా 2025-2029 విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**కార్యవర్గ సభ్యులు వీరే**

విశాఖ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్‌శెట్టి, కార్యదర్శిగా జి.శ్రీరామమూర్తి, కోశాధికారిగా ఎన్.రఘు నాథరెడ్డితోపాటు ఉపాధ్యక్షులుగా కే.రామారావు, డి.లక్ష్మీసింధు, విజయ్‌కుమార్ నటరాజన్, కె.రవికుమార్, పరవాడ ఈశ్వరరావును ఎన్నుకోగా సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీధర్, బివిఎస్ఎన్ ఎర్రాజి, జాన్‌జీవన్‌కుమార్ రంధి, ఈగల హేమంత్ కుమార్, పి.రమేష్‌ను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఏడుగురు ఈసీ మెంబర్లను కూడా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం 2025 నుండి 2029 వరకు తమ బాధ్యతను నిర్వహిస్తుంది.

## విశాఖ రైల్వే స్టేషన్‌కు ప్లాటినం గ్రీన్ రైల్వే సర్టిఫికేషన్

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:** ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు గ్లోబల్‌గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా అత్యధిక ప్లాటినం రేటింగ్‌తో ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ రైల్వేస్టేషన్ సర్టిఫికేషన్' లభించింది. ఈ గుర్తింపు స్టేషన్ పర్యావరణ అనుకూల పద్ధతులు, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో స్థిరమైన భావనలను అవలంభించడం ద్వారా లభించింది. ఈ సర్టిఫికేషన్ సాధించడంలో అంకితభావంతో పనిచేసిన అధికారుల బృందాన్ని వాల్టేర్ డివిజనల్ రైల్వేమేనేజర్ లలిత్‌బోహ్ర అభినందించారు. గ్రీన్ రైల్వేస్టేషన్ రేటింగ్ వ్యవస్థను భారతరైల్వే పర్యావరణ డైరెక్టరేట్, (గ్లోబల్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్) సహకారంతో అభివృద్ధి చేసింది. నీటి సంరక్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, ఇంధన సామర్థ్యం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించడం, సహజ పదార్థాల కనీస వినియోగం, ప్రయాణీకులు, సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడం వంటి కీలకమైన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు అందిస్తారు.

**IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) AT NARSIPATNAM**
**E.P NO.36/2019O.S. NO. 58/2010**
**Between**
State Bank of India, Narsipatnam Represented by its Branch Manager Narsipatnam **...DHR/PLAINTIFF**
**And**
Bolem Appala Naidu and others. **...JDRs/ Defendants**
**NOTICE OF SALE**
The D.Hr bank filed above numbered EP for recovery of E.P amount against J.Drs and in order to recover the said amount, the schedule property will be sold in open court through auction on **22-09-2025 from 10-30am to 5pm** by the Hon'ble court. Any person i.e. any bidder who is interested in the auction may participate in the auction on that day.
**BY ORDER OF THE COURT**
**Date of sale: 22-09-2025**
**Further hearing Date: 29-09-2025**
**SCHEDULE**
**Item No-3**
Visakhapatnam District( presently Ankapalli Dist), Narsipatnam Sub Registry, Narsipatnam Mandal, Neelampeta Panchayat, Neelampeta Village Dry land in S.No.82/8 in an extent of Ac.0.26 cents out of Ac.4.00 cents bounded by:
**East :** Land of Bolem People
**South :** Vacant site of Anam Mahalakshmi
**West :** House of SeeramreddySanyasi
**North :** Land of Petla Pedda Ramamurthy
**POKKUNURI NARASIMHAM**
**Advocate for D.Hr/plaintiff**
Narsipatnam
Date:6-09-2025

## జెర్సీలు అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : ఎసిఎ ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 12 నుండి 14వ తేదీవరకు జరిగే నార్త్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా వికలాంగుల క్రికెట్ జట్టు సభ్యులకు జెర్సీలను ఆదివారం బహుకరించారు. విజయనగరం జిల్లా ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజషన్ సెక్రటరీ ఎర్రింటి కృష్ణ నివాసంలో ఆయన కుమారులు జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వికలాంగ క్రీడాకారులను ప్రోత్సహించి జెర్సీలను అందించిన కృష్ణకు టీమ్ కెప్టెన్ వాసుపల్లి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, శ్యామ్ శ్రీవత్స, శీర్డన్, జట్టు సభ్యులు పాల్గొన్నారు.

## వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కేన్సర్‌తో బాధపడుతున్న తగరపువలస ప్రాంతానికి చెందిన పి.సరోజినికి వైద్యం కోసం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రూ.10 వేలు సాయం చేశారు. అసోసియేషన్ ప్రతినిధులకు ఆమెతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, జి.సాయి, ఎం.గోపి, వి.సత్యనారాయణ పాల్గొన్నారు

## స్టీల్ కంచాల పంపిణీ

ప్రజాశక్తి- మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబేకాలనీలోని సునీల్ శర్మ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ కంచాలను రెడ్డిపల్లికి చెందిన శ్రీఆది చంద్ర హనుమాన్ సేవా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. పాఠశాలలో సుమారు 180 మంది విద్యార్థులకు స్టీల్ కంచాలతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్స్, పెన్లు పంపిణీచేశారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీతాదేవి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎల్‌వి.కుమార్, విద్యా కమిటీ చైర్మన్ చిన్న పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- ఉక్కునగరం : జివిఎంసి 88వ వార్డు పరిధి టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులపై ఒత్తిడి తెస్తామని సిపిఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ సముదాయంలో టిడ్కో గృహ లబ్ధిదారుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, టిడ్కో గృహాలు నిర్మించి పదేళ్ళ గడుస్తున్నా మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు కేటాయించక పోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, టిడ్కో గృహ లబ్ధిదారులు ఎ.గోపి, మల్లేశ్వరరావు, తిరుపతిరావు, పాల్గొన్నారు.

## శిథిలావస్థలో పాఠశాల

ప్రజాశక్తి- ఆనందపురం: బంటుపల్లి పంచాయతీ వేములవలస ఎఫ్‌హెచ్ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని, విద్యార్థుల ప్రాణ భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోన పైడిరాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాత భవనం వల్ల వారు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ భవనాన్ని కూల్చి కొత్త భవనం నిర్మించడంతో పాటు మరుగుదొడ్లను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల రహదారి కూడా అధ్వానంగా ఉండటంతో వర్షాకాలంలో బురదలో నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యపై ఇప్పటికే మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేశామని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని కోరారు.

# కూటమి ప్రభుత్వ హామీలను అమలుచేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- కొమ్మాది : భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని విశాఖ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు పేడాడ రాజశేఖర్ డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15వ తేదీన విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం కొమ్మాది కూడలి వద్ద ఆ సంఘం కార్యకర్తలు, సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, రాజశేఖర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షేమ బోర్డులో రూ.వేల కోట్లు ఉన్నాయని, వాటిని సత్వరమే విడుదల చేసి కార్మికులకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. విజయవాడలో లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.తిరుపతిరావు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై వైసిపి పోరుబాట

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ సమీపంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రైతుల సమస్యలపై రైతన్న పోరుబాట ఫ్లెక్సీలను భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో యూరియా అందక వరి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగుల మందులు సక్రమంగా అందాయని తెలిపారు. ప్రస్తుతం యూరియా బస్తా కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి అక్కడ క్యూలైన్ కట్టినా చివరకు అందని పరిస్థితి ఉందని ఎద్దేవాచేశారు. అన్నదాత పోరు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఈనెల 9వ తేదీన భీమిలి ఎంపిడిఒ కార్యాలయం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు రైతులతో ర్యాలీగా వెళ్లి రైతు



వైసిపి పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యలపై ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు వైసిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.అప్పలనాయుడు, బంక సత్యం, వెంకట్రావు, గంగరాజు, జి.శ్రీను పాల్గొన్నారు.

# 13న విజయవాడలో పింఛనుదారుల సదస్సు


ప్రజాశక్తి -తగరపువలస : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇపిఎస్-95 పెన్షనర్ల ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీన విజయవాడలో జరుగు పింఛనుదారుల సదస్సును జయప్రదం చేయాలని జ్యూట్ మిల్లు పింఛనుదారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానూరు రాంబాబు, దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక జిఆర్.భవన్‌లో ఆదివారం పింఛనుదారుల సమావేశం నిర్వహించారు. కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించకుండా అర్హులందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణ రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లోపలవురు సంఘం నాయకులు పాల్గొన్నారు

# రైతు ఫిర్యాదును పట్టించుకోని లైన్‌మ్యాన్

ప్రజాశక్తి-ఆనందపురం : బంటుపల్లి పంచాయతీకి చెందిన ఒక రైతు తన బోరు పంపు మోటార్ పనిచేయకపోవడంపై స్థానిక లైన్‌మన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. సమస్యను లైన్‌మ్యాన్‌కు చెబితే 'కార్యాలయానికి చెప్పండి' అంటూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారని రైతు చెబుతున్నాడు. రైతు ఆదివారం ఉదయం రెండు మూడు సార్లు కార్యాలయానికి ఫిర్యాదు చేసినప్పటికీ, సిబ్బంది పట్టించుకోలేదని వాపోయాడు. రైతు మధ్యాహ్నం మళ్లీ ఫోన్ చేయగా, "ఇంకా సమస్య పరిష్కారం కాలేదా?" అని తిరిగి ప్రశ్నిస్తున్నారని తెలిపాడు. చివరికి రైతు విద్యుత్ శాఖ ఎఇ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేసిన అరగంటలోనే లైన్‌మ్యాన్, సిబ్బంది వచ్చి పనులు చేపట్టారని తెలిపారు. ఈ ఘటనపై ఎఇ అప్పలనాయుడు మాట్లాడుతూ, లైన్‌మ్యాన్, కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై దర్యాప్తు జరిపించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# జూ పార్కులో జన్మించిన జంతు పిల్లలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఏడు జంతు, పక్షి పిల్లలు జన్మించాయి. చౌసింఘా, బ్లూ గోల్డ్ మకావ్, బ్లాక్ బక్ వంటి జాతులకు సంబంధించిన పిల్లలు జన్మించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరించిపోయే జాబితాలో ఉన్న చౌసింఘా జాతి విజయవంతమైన సంతానోత్పత్తి దాని దీర్ఘకాలిక పరిరక్షణ వైపు ముఖ్యమైన అడుగును సూచిస్తుందని పేర్కొన్నారు. బ్లూ గోల్డ్ మకావ్‌ను ప్రత్యేకంగా రూపొందించిన కృత్రిమ ఇంక్యూబేటర్లలో పొదిగించినట్టు తెలిపారు. బ్లూ గోల్డ్ మకావ్ పిల్ల ప్రస్తుతం జంతు వైద్య బృందం ఆధ్వర్యాన హ్యాండ్ రీయరింగ్ ద్వారా సంరక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.



## నేరాలు ఘోరాలు



## 'మేఘాద్రి'లో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-పెందుర్తి: మేఘాద్రి రిజర్వాయర్‌లో ఆదివారం ఇద్దరు యువకులు మృతిచెందారు. సిఐ సతీష్‌కుమార్ కథనం ప్రకారం... బల్లంకి వాసు, బల్లంకి శేఖర్, యేడాడ లక్ష్మణ్‌కుమార్ యార్డ్‌లో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో మేఘాద్రిలో చేపలు పట్టడానికి ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో వెళ్లారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి చెందిన బల్లంకి శేఖర్ (18), చిన్నముషిడివాడ ఆక్సిజన్ కాలనీకి చెందిన యేడాడ లక్ష్మణకుమార్ (18) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీనియర్ గజ ఈతగాళ్లను మేఘాద్రి డ్యామ్‌లోకి దించి గాలింపు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీసి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రాంతం వైపుకు రావద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా యువత విస్మరించడం సరికాదన్నారు.

## పరారైన రిమాండ్ ఖైదీల అరెస్ట్

ప్రజాశక్తి- అనకాపల్లి : చోడవరం సబ్‌జైల్ హెడ్‌వార్డర్ వాస వీర్రాజుపై దాడి చేసి పరారైనరిమాండ్ ఖైదీలను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్‌పితుహిన్ సిన్హా వెల్లడించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి ఎం.శ్రావణితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈనెల 5న, చోడవరం సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నక్క రవికుమార్, బెజవాడ రాము, యాక స్వామి జైలు హెడ్‌వార్డర్ వీర్రాజుపై సుత్తితో దాడి చేసి గేటు తాళాలు తీసిపరారయ్యారు. ఈ క్రమంలో ఎఎస్ఐ కృష్ణమూర్తి మొబైల్ ఫోను కూడా దొంగలించుకు పోయారు.ఈ ఘటన అనంతరం, లుకౌట్ నోటీసులు జారీ చేసిన అనకాపల్లి జిల్లా పోలీసులు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసారు. వాహన తనిఖీలతో గాలింపు చేపట్టారు ఈనెల 6న విశాఖపట్నం సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గొల్లలపాలెం జంక్షన్ ఎస్‌బిఐ వద్ద పరారైన ఇద్దరు నిందితులను పట్టుకొని, చోడవరం పోలీసులకు సమాచారమిచ్చారు. చోడవరం సి.అప్పలరాజు, సిబ్బందితో కలిసి సిటీ టాస్క్ ఫోర్స్ కార్యాలయం నుంచి నిందితులను అదుపులోకి తీసుకుని చోడవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణలో నిందితులిద్దరూ నేరాన్ని అంగీకరించారు. రవికుమార్, రాములకు బెయిల్ వచ్చినప్పటికీ జామీను దొరకకపోవడం, హెడ్ వార్డర్ వీర్రాజుపై వ్యక్తిగత కక్షతో డిఎల్‌ఎస్‌ఎ బెయిలు దరఖాస్తు పంపించని నేపథ్యంలో మూడో నిందితుడు ఏక స్వామి ప్రేరేపణ, సహకారంతో ఈ పనికి పూనుకున్నట్లు అంగీకరించారు. మీడియా సమావేశంలో చోడవరం సిఐ పి.అప్పలరాజు, ఎస్ఐ బి.కార్తీక్ జిల్లా సబ్ జైల్ ఇన్‌ఛార్జి ఆఫీసర్ డి.రాజు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య విద్యలో సాయి శ్రీనిజ ప్రతిభ



ప్రజాశక్తి- ఆనందపురం : వేములవలసలోని సత్య కల్యాణ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన కొండవీటి సాయి శ్రీనిజ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. 2023-24 విద్యా సంవత్సరానికి డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పరీక్షల్లో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఇంతకుముందు రెండు సబ్జెక్టుల్లో స్టేట్ టాపర్‌గానూ, విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాలలో బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ గానూ ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈనెల 9న విజయవాడలో జరిగే విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ సభలో సాయి శ్రీనిజకు మూడు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం ప్రదానం చేయనున్నారు. ఈ విజయంపై తండ్రి శంకర సాయి శర్మ ఆనందం వ్యక్తం చేశారు. సాయి శ్రీనిజ తల్లిదండ్రులు రాజరాజేశ్వరి, శంకర సాయి శర్మ దంపతులు భీమిలిలోని కేథరిన్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు.

## పిపిపితో వైద్య విద్య దూరం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలోకి మార్చడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వైద్య విద్య దూరం అవుతుందని, తక్షణమే దాన్ని రద్దు చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైద్య విద్యపై ఇటీవల మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ద్వారా మెడికల్ సీట్ల రిజర్వేషన్లలో 50 శాతం కోత విధించారన్నారు. రాష్ట్రంలో కొత్తగా 2400 సీట్లు అందుబాటులోకి రాగా పిపిపి విధానం వల్ల 1200 సీట్లు మాత్రమే కన్వీనర్ కోటా కిందకు వస్తాయని, మిగిలిన సీట్లన్నీ ప్రైవేటు యాజమాన్యం రూ.కోట్లకు అమ్ముకునే సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించిందని, ఇది మెడికల్ సీట్ల దోపిడీ పథకం అని విమర్శించారు. కేంద్రం అనుమతించిన ఫ్రీ మెడికల్ సీట్లను రాష్ట్రం ప్రైవేటుకు దారాదత్తం చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం నేడు అంతకంటే ప్రమాదకరమైన పద్ధతిలో మొత్తం 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించి రిజర్వేషన్ కోటాను సగానికి కోత విధించడం ధర్మమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత సీట్లకు అర్హత కలిగిన తెల్ల కార్డులు లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసిలతో పాటు అన్ని వర్గాల వారు పిపిపిలో కన్వీనర్ సీట్లకు రూ.12 లక్షల నుండి రూ.15 లక్షలు చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, కె.మల్లేష్, వీరబాబు, ఉమామహేశ్వరి, రవిశేఖర్, సిహెచ్.నాగేశ్వరరావు, రాము, సామ్యూల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కామెడీ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కామెడీ షో అలరించింది. ఎవి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, పుష్పమి, రాగన్‌నాయుడు, నరసింహారావు, సూర్య మంత్రావు, ఎస్ఎస్.నాయుడు లఘు నాటికలు, స్కూల్, డాక్టర్-పేషెంట్, ముష్టివాడు, థియేటర్, యోగా, మహిళామండలి, గోల్డ్ మెడల్, దొంగ దొంగే, అందరిని కలుస్తావు, గోవిందరావు ఇల్లు ఎక్కడ తదితర స్కిట్లను ప్రదర్శించారు. ముందుగా వాగ్దేవి నృత్యాలయం విద్యార్థులు నృత్యప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, బి.మాల్యాద్రి పాల్గొన్నారు.

## టిడిపి 51వ వార్డు అధ్యక్షునిగా కీర్తి



ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 51వ వార్డు టిడిపి అధ్యక్షునిగా సనపల కీర్తి నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖ ఎంపీ శ్రీభరత్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి కీర్తికి నియామక పత్రం అందజేశారు. దీంతో వార్డులోని టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి కీర్తికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ, తన మీద నమ్మకం ఉంచి అధిష్టానం ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తానన్నారు. వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని, పార్టీ పటిష్టతను మరింత మెరుగుపరిచే విధంగా పనిచేస్తానని చెప్పారు.

## అప్పన్న ఆలయం మూసివేత

ప్రజాశక్తి- వేపగుంట : ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి 1.24 నిమిషాల వరకు చంద్రగ్రహణం కారణంగా శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ తలుపులు సంప్రదాయరీతుల ప్రకారం మూసివేశారు. మూసివేయడానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఆలయ స్థానాచార్యులు టిపి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, అర్చకులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత, ఆలయాన్ని తెరిచి, శుద్ధి పూజలు నిర్వహించిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. దర్శనాలు సోమవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు గోపాలపట్నం సిఐ ఎల్.సన్యాసినాయుడు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు గొడవల్లో తలదూర్చవద్దని, అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొనవద్దని తెలిపారు. ఎవరైనా వివాదాల జోలికి పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

# ఇఒఐల పేరిట ఉక్కుపై కుట్ర




ఆరిలోవలో పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ) పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ప్రభుత్వాలు ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, చట్ట విరుద్ధంగా తొలగించిన 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, వీరి స్థానంలో ఇతర రాష్ట్రాల కార్మికుల నియామకం ఆపాలని, ప్లాంట్‌లోని 6 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మిక పోరాటాలు, దీక్షలపై కూటమి ప్రభుత్వ పోలీస్ నిర్బంధం నిలిపివేయాలని, ఉద్యోగులకు, కార్మికులకు పూర్తి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 11వ తేదీన సాయంత్రం 5 గంటలకు పాతగాజువాకలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

**ఆరిలోవ :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన 13వ వార్డు పరిధి కనకమహాలక్ష్మినగర్, జైభీమ్ నగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, తక్షణం అదానీతో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో ఐసి.నాయుడు, బి.రత్నం, ఇ.ఆదినారాయణ, యు.మంగ, టి.రాజు, పి.శంకరరావు, రాగోలు గణపతి, జి.లక్ష్మీనారాయణ, సిహెచ్.రాము పాల్గొన్నారు.

**పెందుర్తి :** జివిఎంసి 97వార్డు పరిధి చినముసిడివాడ ప్రాంతాలలో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ఇఒఐ పేరుతో విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని డిమాండ్‌చేశారు. ఈ పాదయాత్రలో జోన్ నాయకులు జి.శంకర్, కె.అప్పలనాయుడు, ప్రభు, ఈశ్వరరావు, ముత్యాలమ్మ, రాజు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




చినముషిడివాడలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

**గాజువాక :** స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని పలు వార్డుల్లో సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రనుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ వల్ల గాజువాక అభివృద్ధి అయిందని, అలాంటి ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపి పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎస్.కృష్ణమూర్తి, ఆర్.నాగేశ్వరరావు, ఎ.లోకేష్, మహేష్, దాసర అప్పారావు, బి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, ఎం.శ్రీదేవి, లక్ష్మి, డి.రమణ, కె.అవతారం, పద్మ, ఎస్.శ్రీనివాస్, త్రినాధ్‌స్వామి, ఎల్.బంగారునాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు..

**ములగాడ :** జివిఎంసి 58వ వార్డు పరిధి గుల్లలపాలెం, రాంనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. కూటమి పాలనలో కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ పాదయాత్రలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్. విమల, బి.మమత, జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, కె.రమణ, రాజు, గంగులు, పి.వరలక్ష్మి, పి.ఈశ్వరమ్మ, అరుణ, పోలమ్మ, సిహెచ్.లక్ష్మి, రవణమ్మ పాల్గొన్నారు.




తగరపువలస సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

**తగరపువలస :** ఇఒఐ పేరుతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆపాలని, అదానీ విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించ వద్దు అని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన స్థానికంగా ఆదివారం సాయంత్రం భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ జ్యూట్ కార్మిక వాడ, జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా ప్రైవేట్ మార్కెట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖ అభివృద్ధి ప్రభుత్వ రంగ సంస్థలతో ముడిపడి వుందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కుట్రను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. విశాఖ ఉక్కును, ఉపాధిని, అభివృద్ధిని రక్షించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ అధ్వర్యాన ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రచారంలో ప్రజలు, అన్ని రంగాల కార్మికులు భాగస్వామ్యం కావాలని కోరారు. అదానీ ప్రీ పెయిడ్ స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నా సరే విధానాల అమలులో తేడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, ఆటో, ముఠా తదితర రంగాల కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 11న గాజువాకలో బహిరంగ సభ - జయప్రదానికి సిపిఎం విస్తృత ప్రచారం




58వ వార్డు పరిధిలో పాదయాత్ర

**మాధవధార :** జివిఎంసి 50వ వార్డు మురళీనగర్ ప్రాంతంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ ఆధ్వర్యాన ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ఇబ్బందులను ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతోపాటు లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించి ఎంతోమంది ఉద్యోగులను రోడ్డు మీదకు లాగే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సనపల రామ్ గోపాలరావు, సనపల నరసింహారావు, ఐద్వా నాయకులు కె పార్వతి, రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు పాల్గొన్నారు.

**కంచరపాలెం :** ఇఒఐని రద్దుచేయాలని కోరుతూ కంచరపాలెంలో సిపిఎం ఆధ్వర్యంలో 54, 55, 56 వార్డుల్లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ సెక్రటరీ బొట్టా ఈశ్వరమ్మ, నాయకులు బి.పద్మ, ఒ.అప్పారావు, ఎమ్.ఈశ్వరరావు, ఎస్.సోమేశ్వరరావు, జి.శ్రీనివాస్, బి.గంగరాజు, ఎల్లాజి, కుమారి తదితరులు పాల్గొన్నారు.




కంచరపాలెంలో...

# దేశవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటించాలి

## స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమంతో ప్రతిఘటించాలని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ 10వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్ శని, ఆదివారం రూర్కెలాలో నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ఉపాధ్యక్షులు జె.అయోధ్యరామ్ ప్రవేశపెట్టగా తమిళనాడు సిఐటియు కార్యదర్శి పన్నీర్ సెల్వం బలపరిచారు. ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, 2021 జనవరి 27న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం వ్యూహాత్మక అమ్మకానికి నిర్ణయించిందని, దీనిని వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్‌లోని అనేక కార్మిక సంఘాలను ఐక్యపరచి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి నేటికీ అనేక ఉద్యమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఐక్య ఉద్యమాలను బలపరుస్తూ రాజకీయ ఉద్యమం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రూ.11,400 కోట్లు స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిందని, కానీ ఆ కేటాయింపులను జిఎస్‌టి, బ్యాంకు బకాయిలను చెల్లించడం కోసం మాత్రమే ఉపయోగించాలనే నిబంధనను విధించిందని తెలిపారు. ఈ సమయంలో విఆర్ఎస్ పేరుతో సుమారు 1600 కార్మికులను తొలగించారని, 5000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమానికి అవసరమైన బలం విశాఖ ఉక్కు కర్మాగారంలో బలహీనమైందని తెలిపారు. ఈ ఉద్యమానికి దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ పరిశ్రమల కార్మిక వర్గం అండగా నిలవాలని కోరారు.




కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అయోధ్యరామ్

దీనిపై పన్నీర్ సెల్వం మాట్లాడుతూ, విశాఖ స్టీల్ కార్మిక వర్గానికి అండగా ఉండడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే విధంగా ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ సిఐటియు స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధులుగా యు.రామస్వామి, టివికె.రాజు, పుల్లారావు, బి.మహేష్, మరిడయ్య, నీలకంఠం, బిఎన్.మధుసూదన్, నమ్మి రమణ, ఒవి.రావు తదితరులతో పాటు ఆరుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

# సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ 'రణభేరి'



అనకాపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** ఆర్థిక, ఆర్థికేతర సమస్యల సాధనకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి ప్రచార జాత నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చిన్నబ్బాయి తెలిపారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో రణభేరి పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం చిన్నబ్బాయ్ మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు పోరాట ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న పోరాట ప్రచార జాతా అనకాపల్లిలో ప్రవేశిస్తుందన్నారు. 19లోగా రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకుంటే, 25న విజయవాడలో రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రణభేరి' ప్రచార జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని కోరారు. అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్ అధ్యక్షులు పి వెంకట్రావు రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు, కోశాధికారి జోగా రాజేష్, సీనియర్ నాయకులు రొంగలి ఉమాదేవి, ఎస్ ఎస్ నాగమణి, జీకేఆర్ స్వామి, అలివేలు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

**యుటిఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయండి**

**కరాస :** పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యల సాధనకు ఈ నెల 15 నుండి 19వ తేదీ వరకు జరిగే 'యుటిఎఫ్- రణభేరి' జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్ఎడి సమీపంలోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన విశాఖ జిల్లా యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్ష మూల్యాంకనం, ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్ట్ తదితర బోధనేతర పనుల భారం విపరీతంగా ఉందని తెలిపారు. ఇవి విద్యా బోధనకు ఆటంకంగా ఉంటున్నాయని వివరించారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, వెంటనే 11వ పిఆర్‌సి బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, బకాయి పడ్డ నాలుగు డిఎలు విడుదల చేయాలని, 29 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి తాడానా అప్పారావు, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, జిల్లా సహాధ్యక్షులు ఎన్.ప్రభాకర్, ఎ.విజయకుమారి, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, ఎమ్. రామకృష్ణ, రియాజ్ అహ్మద్, తాటికొండ జగన్ పాల్గొన్నారు.



విశాఖ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత

## ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల ర్యాలీ




ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవరుఉల

**ప్రజాశక్తి- పాయకరావుపేట :** తమను ఆదుకోవాలని కోరుతూ, పట్టణంలో శ్రీదుర్గా ఉషోదయ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. పెంటకోట, మంగవారం, సత్యవరం, రేపాక, ముకుందరాజుపేట, లక్ష్మీపురం, బంగారయ్యపేట, డొంకాడ తదితర గ్రామాల ఆటో యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు. స్థానిక చిత్రమందిర్ సెంటర్ నుంచి వై జంక్షన్ వరకు ఆటో రిక్షాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. యూనియన్ ప్రెసిడెంట్ లావేటి ఈశ్వరరావు, సెక్రటరీ అప్పారావు, లోకల్ ప్రెసిడెంట్ దమ్మేటి వెంకట్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుతో రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితలను ఆటో డ్రైవర్లు కోరారు.

## పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

**ప్రజాశక్తి. సబ్బవరం:** మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో భారత పెట్రోలియం బంక్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామికవాడ పరవాడలో వాహనరద్దీ ఎక్కువగా ఉందని, వాహనదారుల అవసరాలకు అనుగుణంగా యజమాని కుటుంబరావు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ, కొరత ఉందంటూ వైసిపితోపాటు ఇతర ప్రతిపక్షాలు విషపూరిత అవాస్తవ ప్రకటనలు చేస్తున్నారని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ, ఎంపిటిసి సీరం అప్పలరాజు, మాజీ ఎంపిటిసి అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గి నాయుడు, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నా రావు, సింగంపల్లి శ్రీనివాసరావు, బంతికోల్ల పద్మ పాల్గొన్నారు.

## పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యసాధన




విజేతల దినోత్సవంలో పట్టాలతో విద్యార్థులు

**ప్రజాశక్తి- కోటవురట్ల :** విద్యార్థులు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఏదైనా లక్ష్యాన్ని సాధించవచ్చని అవంతి కళాశాల చైర్మన్ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు, ఆదివారం అవంతి కళాశాల వద్ద అచీవర్స్ డే(విజేతల దినోత్సవం) ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు సాధన సంపాదన ఎప్పటికీ ఆగకూడదన్నారు. జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భావనాత్మక, పరిశోధనాత్మక అభ్యాసం అలవర్చుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని తెలిపారు, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, ఫార్మసీ డిగ్రీ విభాగాల నుంచి ఎంపికైన 1050 మంది విద్యార్థులకు డిగ్రీపట్టాలను అందజేశారు.కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ జెట్టి సుబ్బారావు, బ్రహ్మకుమారీస్ మాధురి, ప్రొఫెసర్ జాస్తి ఆనంద చందుల్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి డానియల్ రాజు పాల్గొన్నారు.

## పలువురికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ప్రజాశక్తి- అచ్యుతాపురం :** మండలంలోని పైలవానిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాజాన విజయ కుమార్ ప్రారంభించిన శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి డాప్స్ అందించారు. 22 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్‌లో తరలించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, పేదలకు వైద్యసేవలు అందిస్తున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందాన్ని గ్రామ సర్పంచ్ , స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందించి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకట రావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, ట్రస్ట్ సభ్యులు లాలం శ్రీనివాస్ (వాసు), వార్డు సభ్యుడు ఆడిగర్ల దేముడు, కాళ్ళ రాజుబాబు, లాలం జగదీష్ టిడిపి నేతలు, శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు, డాక్టర్ ఎస్.అరుణ, క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ గణపతి, ఇతర వైద్య సిబ్బంది, యూత్ పాల్గొన్నారు.

**మునగపాక:** స్థానిక సంతబయలులో రామాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, స్వాతి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరం లో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 32 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేసి, బస్సులోఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ పైలా వెంకటలక్ష్మి, ఇల్లూరి నూకనరసింగరవు, పెంటకోట శ్రీ రామమూర్తి, ఆడారి గోవింద, దాడి శివ, సరగడం జగన్, బొడ్డేడ ప్రసాద్ (జూనియర్) వేగి దేవత నాయుడు, దాడి భీమి నాయుడు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- అందేంత ఎత్తులో వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు
- చెట్టుకొమ్మలు, లతలు అల్లుకుపోవడంతో భయం భయం

**ప్రజాశక్తి -వడ్డాది :** బుచ్చయ్యపేట మండలం వడ్డాది హై స్కూల్ ప్రహరీని అనుకొని 33కెవి విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండడంతో ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం వస్తుందోనని ఆందోళన వ్యక్తమౌతోంది. విద్యుత్ వైర్లు చేతికి అందేంత ఎత్తులో వేలాడుతూ ఉండడంతోపాటు, వాటిని అల్లుకున్న పచ్చిలతలు, చెట్టుకొమ్మలు ఊయలలా ఊగుతూ, మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇదే మార్గంలో వాకర్స్ పాఠశాల వేళల్లో విద్యార్థులు ఇక్కడకిక్కడే సంచరిస్తుంటారని, ఎపుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని, వాటిపై అల్లుకుపోయిన చెట్టుకొమ్మలు, లతలను తొలగించాలని కోరుతున్నారు.



విద్యుత్‌తీగలు, కొమ్మలు అల్లుకున్న విద్యుత్ వైర్లు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నరసింగబిల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి - కశింకోట :** మండలంలోని నరసింగిబిల్లి హైస్కూల్ 2005 -06 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరు పరామర్శించుకుని, గత స్మృతులను జ్ఞాపకం చేసుకోవడంతోపాటు తాజా విషయాలపై మాట్లాడుకున్నారు.కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు నమ్మి గణేష్ సేనాపతి సూరిబాబు మజ్జి ఈశ్వరరావు రాజాన సురేష్ సోమిరెడ్డి నాగేశ్వరరావు, షేక్ అన్సర్,పడాల ధర్మరాజు, నమ్మి రాజు, బుదిరెడ్డి కిష్ణ మూర్తి, బి. కష్ణ, ధనలక్ష్మి, సరోజని, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షునిగా గొంతిన




శ్రీనివాస్‌ను అభినందిస్తున్న పీలా, బత్తుల

**ప్రజాశక్తి- కశింకోట :** మండల టిడిపి అధ్యక్షునిగా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి . గొంతిని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. శ్రీనివాసరావును రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరుల దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు, షేక్ బాబర్ పాల్గొన్నారు.

## రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి -మునగపాక:** స్థానిక పసల మారమ్మ"రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా కోయిలాడ రమణబాబు, కార్యదర్శిగా కాండ్రేగుల రమణబాబు, కోశాధికారిగా ఆళ్ల జగ్గ అప్పారావు, సభ్యులుగా మొల్లటి వెంకట అప్పారావు, భీసెట్టి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ రవాణా, విద్యుత్తు, ఎరువులు, విత్తనాలు పంపిణీ తదితర రైతాంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## సిఎం సహాయనిధి సాయం పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : పేదరోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమందికి లబ్ధి చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని కన్నంపాలెం గ్రామానికి చెందిన కోన చెల్లయమ్మకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్యసేవలో కవర్ కాని వ్యాధుల చికిత్సకు సిఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, కన్నంపాలెం సర్పంచ్ బర్ల తాతయ్యలు, సకూరు కోటి, ఎంపిటిసి చిన్న, అచ్చిబాబు పాల్గొన్నారు.

**అనకాపల్లి రూరల్:** మండలంలోని సుందరయ్య పేట గ్రామానికి చెందిన ఇద్దరు లబ్దిదారులకు సిఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అందచేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో సుందరయ్య పేటకు చెందిన చెల్లపల్లి వెంకాయమ్మకు రూ.23,200, తెలపోలు లక్ష్మికి రూ.20,వేలు చెక్కులను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు చందక నరసింగరావు, పార్టీ అధ్యక్షులు ఊరిగిటి శివ సూర్యనారాయణ , మహిళ అధ్యక్షురాలు పిల్లా లక్ష్మి, మడక శ్రీను, బోయిన పైడిరాజు, బాలిబోయిన రమణ పాల్గొన్నారు.

## వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా సత్యారావు



అధినేత జగన్‌తో సత్యారావు

ప్రజాశక్తి -చోడవరం : వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా మండలంలో గోవాడ గ్రామానికి చెందిన ఏడువాక సత్యారావును పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న పాడేరు, అరకు నియోజక వర్గాల పరిశీలకుడిగా సత్యారావు వ్యవహరించనున్నారు. గోవాడ సర్పంచ్‌గా, చోడవరం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సత్యారావు పనిచేశారు. పార్టీ తనపై నమ్మకముంచి, రాష్ట్రస్థాయి పదవినిచ్చి గుర్తించడంపై సత్యారావు ఆనందం వ్యక్తం చేస్తూ, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైసిపి పరిశీలకునిగా 'పైలా'



అధినేత జగన్, ఇతర వైసిపి నేతలతో పైలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పరవాడ : వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా , అనకాపల్లి పార్లమెంట్ సహాయ పరిశీలకుడిగా నియమితులైన పైలా శ్రీనివాసరావును అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని మాడుగుల, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు విడుదల చేసింది. మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు బూడి ముత్యాలనాయుడు, కంబాల జోగులును సమన్వయం చేసుకుంటూ, పార్టీ కార్యక్రమాలు జరుగుతున్న తీరును, పార్టీ అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలను వివరిస్తూ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకులు శోభా హైమావతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌ను సమన్వయం చేసుకుంటూ పార్టీ అధిష్టానానికి నిత్యం అందుబాటులో వుండాలన్నారు.

# అధిక ధరలకు యూరియా అమ్మితే కఠిన చర్యలు

### - జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి కశింకోట : జిల్లాలో రైతు సేవా కేంద్రాల వద్ద 1050 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ దుకాణాలలో 450 మెట్రిక్ టన్నులు మొత్తంగా ప్రస్తుతం 1500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటు లో ఉన్నాయని,జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. . రెండు రోజుల్లో రైతు సేవ కేంద్రాలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా వీటిని రైతులు పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం మండలంలోని వెదురు పర్తి రైతు సేవా కేంద్రంలో రైతులకు ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరును కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా లభ్యత, పంపిణీ చర్యల పర్యవేక్షణకు తహసీల్దార్, ఎంపిడిఒ వ్యవసాయ అధికారులతో మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. . సరఫరాలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకూడదని అధికారులను కలెక్టర్ సూచించారు. రైతులు తప్పని సరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకృత విధానంలో యూరియా పొందాలని కలెక్టర్ సూచించారు. అధికంగా ఎరువులను వినియోగిస్తే దోమపోటు పొడతెగులు వంటి చీడ పీడల ఉధతి పెరిగే అవకాశం ఉన్నదని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలన్నారు. అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని,బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయిషా, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఎఒ ఎం. స్వప్న పాల్గొన్నారు

# కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై భారీగా నీరు

**అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు : నీటి నిల్వతో పాడౌతున్న రోడ్లు**

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద నర్సీపట్నం రోడ్‌లో ఆదివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో నర్సీపట్నం అనకాపల్లి వెళ్లి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు ఇప్పటికే పలుమార్లు గోతులు పూడ్చినప్పటికీ, వర్షాలకు రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో మళ్లీ రోడ్డు నిండా గోతులౌతున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడ సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తే, నీరు నిలిచినా రోడ్డు పాడవ్వదని వాహనదారులు స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు



రోడ్డుపై భారీగా చేరిన వర్షపు నీరు

## ఎపిటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కశింకోట : ఎపిటిఎఫ్ మండలశాఖ ఎన్నికలు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షునిగా కె. సూర్య నారాయణ గౌరవ అధ్యక్షులుగా ఎన్. రమణ, ప్రధాన కార్యదర్శిగా పిఎం. అప్పారావు, ఉపాధ్యక్షులుగా జి. దేముడుబాబు, టి. తాయారమ్మ, జి.సునీత, వై. శ్రీనివాసు ,జిల్లా కౌన్సిల్‌గా పి. గణపతి, డిఎస్. మల్లేశ్వరరావు, ఐఎం. రఘురామ్, పి. బాలరామ్, డి. సత్య నారాయణ, కార్యదర్శులు గా ఎంఎస్. క్రిస్టోఫర్, పివిడి. ప్రసాద్, కె. వేగలేశ్వరరావు, డి. శ్రీదేవి, యు.ఉషాకిరణ్ ఎన్నికయ్యారు

## గుండెపోటులో అంగన్వాడీ టీచర్ మృతి



సత్యవతి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -మునగపాక: స్థానిక 5వ అంగనవాడీ కేంద్రం కార్యకర్త విల్లూరి సత్యవతి (41) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. వివరాలివి. శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన సత్యవతిని హుటాహుటిన అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా మరోసారి గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందారు. సత్యవతికి ఇద్దరు కుమారులు. తల్లి మరణించడంతో వారి రోదరణ పలువురిని కలచి వేసింది. విషయం తెలుసుకున్న ఎలమంచిలి ప్రాజెక్ట్ మునగపాక సెక్టర్ సూపర్వైజర్ అన్నపూర్ణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, టిడిపి నాయకులు పెంటకోట విజయ్, ముల్లేటి సత్యనారాయణ, సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, ఎఎన్‌వి మహేష్, మాజీ జెడ్‌పిటిసి మళ్ల సంజీవరావు సంతాపం తెలిపారు.

## వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : స్త్రీశక్తి పథకం మాదిరిగానే వికలాంగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ కోరారు. ఆదివారం జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సహకారంతో వీరుయాదవ్ ఆధ్వర్యంలో మాటూరు ఏసుదాసు, బానోద్ దిలీప్‌లకు ట్రై సైకిల్, వీల్‌ఛైర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు యాదవ్ మాట్లాడుతూ వేల కోట్లు వెచ్చిస్తూరాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్‌సౌకర్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారని, కేవలం వందల సంఖ్యలో ఉన్న వికలాంగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. సదరం సర్టిఫికెట్ ఆధారంగా కొందరికే వికలాంగ రాయితీలు కల్పించడం శోచనీయమని, వైకల్యమున్న ఎందరో విద్యార్థులు చదువుల కోసం నానా అవస్థలు పడుతున్నారని, వారికి ఉచిత బస్ సౌకర్య ప్రయోజనం కల్పించాలన్నారు. వైకల్యంతో ఇబ్బందులు పడుతున్న నిస్సహాయులైన వికలాంగులకు ఉచిత బస్ సౌకర్య ప్రయోజనం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నామా చంద్రశేఖర్, చెట్టుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# యూరియా లభ్యతపై గ్రామసభలు



యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట, గణపర్తి గ్రామాల రైతు సేవా కేంద్రాలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. యూరియా నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని రైతు సేవా కేంద్రాలలో యూరియా నిల్వలు ఉన్నాయని, రాజకీయ దురుద్దేశంతో ప్రజలను వైసిపి నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షించి,తగు చర్యలు చేపడుతున్నామన్నారు రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** మండలంలో తిమ్మరాజుపేట పిఏసిఎల్‌లో యూరియా పంపిణీని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. యూరియా పంపిణీపై ఎఒ, ఇతర సిబ్బందిని ప్రశ్నించారు.మాజీ జెడ్‌పిటిసిజనపరెడ్డి శ్రీనివాస రావు, బి రాందాస్,శరగడం జగ్గారావు, ఎఒ శంకర్ గోవింద్, పిఎసిఎస్ సిఇఒ సూర్యమహేశ్వరరావు పాల్గొన్నారు.

**బుచ్చెయ్యపేట :** మండలంలోనిరాజాం, తైవురం గ్రామాల్లో ఆదివారం యూరియా నిల్వలు, సరఫరాపై గ్రామసభలు నిర్వహించారు. డిఎల్‌డిఒ మంజులావాణి మాట్లాడుతూ, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల పంపిణీకి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎం లక్ష్మి, మండల ప్రత్యేక అధికారి గోపాల్, ఎంపిడిఒ భానోజీరావు, ఎఒ బి భాస్కరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

**చోడవరం :** మండలంలో యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, వాటి పంపిణీపై పరిశీలన, పర్యవేక్షణకు బృందాలను నియమించినట్లు తహశీల్దార్ ఎ.రామారావు తెలిపారు. సిఐ, ఎంపిడిఒ, ఎంఎఒ నేతృత్వంలో బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు.ఎక్కడైనా ఎరువులు అక్రమ నిల్వలు ఉంటే మండల కేంద్రంలో కంట్రోల్‌రూంకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆంజనేయులు, సిఐ అప్పలరాజు అధికారులు పాల్గొన్నారు.

**కోటవురట్ల :** రైతులు అవసరానికి సరిపడా ఎరువులు కొనుగోలు చేయాలని పిఎసిఎస్ అధ్యక్షులు వేచలపు జనార్దన్ అన్నారు, ఆదివారం మండలంలో పాములవాక రైతు సేవా కేంద్రం వద్ద ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఎరువులను అనవసరంగా నిల్వచేయరాదని సూచించారు, కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లస్టర్ ఇన్చార్జి భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ సహ పలువురు రైతులు పాల్గొన్నారు.

**ఎస్ రాయవరం :**మండలంలో దార్లపూడి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, పెట్టుగొల్లపల్లి, భీమారం, గోకులపాడు, ధర్మవరం అగ్రహారం గ్రామాలలో యూరియా లభ్యత పై మండల తహశీల్దార్ జె రమేష్‌బాబు అవగాహన కల్పించారు. ఎఒ సౌజన్య పాల్గొన్నారు.

**బుచ్చయ్య పేట :** మండలంలోని రాజాంలో 4.5 మెట్రిక్‌టన్నులు, గున్నెంపూడి రైతు సేవా కేంద్రాల్లో 12.015 మెట్రిక్ టన్నులు యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు ఎఒ బి. భాస్కరరావు తెలిపారు.. గంటి కొర్లం రైతుసేవా కేంద్రంలో 1.170 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు తెలిపారు

**అనకాపల్లి :** యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరిపడా యూరియా సరఫరాకు ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని ఊడేరు, కూండ్రం, బవులువాడ, తుమ్మపాల, వల్లూరు, రాజుపాలెం గ్రామాలలో ఆదివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎడిఎ. సుబ్రమణ్యం మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్‌లో అన్ని మండలాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రెండు రోజుల్లో యూరియా అందుబాటులోకి తెస్తామన్నారు. ఎఒ పి. రంగాచారి, ఆత్మ ఎటిఎంపి రామకృష్ణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మళ్ల శ్రీనివాసరావు, ప్రవీణ, విఎఎలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

**కోటవురట్ల :** స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం యూరియా పంపిణీ చేసినట్లు తహసిల్దార్ తిరుమలబాబు తెలిపారు. 52 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎఒ సరోజిని మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా కొనుగోలు చేసుకోవాలని నిల్వలు ఉంచుకోరాదన్నారు.

**సబ్బవరం :**మండలంలోని గొట్టివాడ పంచాయతీలో యూరియా లభ్యతపై తహశీల్దార్ బి. చిన్నికృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండలంలో తహశీల్దార్, ఎంపిడిఒ, మండల వ్యవసాయాధికారి నేతృత్వంలో మూడు కమిటీలు యూరియా పంపిణీపై పర్యవేక్షిస్తారని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడతామన్నారు.

# ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా బోధన

**▶▶ డిజిటల్ క్లాస్‌లతో విద్యాభ్యాసం**

**▶▶ 30 మంది నుంచి 138కి పెరిగిన విద్యార్థుల సంఖ్య**

**▶▶ అందరి సహకారంతో మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాల అభివృద్ధి**




డిజిటల్ బోర్డులో బోధిస్తున్న టీచర్

**ప్రజాశక్తి- మాడుగుల:**మూత దశకు చేరుకున్న పాఠశాలను గ్రామపెద్దలు, ఆ పాఠశాలలో చదివి వివిధ ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు సహాయ సహకారంతో మళ్లీ ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు పూర్వవైభవం తీసుకొచ్చారు. గతంలో శిధిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనంలో 30మందికి తక్కువ విద్యార్థులు ఇద్దరి ఉపాధ్యాయులు ఉండేవారు.విద్యార్థుల సంఖ్య పెద్దగా లేకపోవడంతో పాఠశాలను మూసే పరిస్థితికి చేరే దశలో జీవం పోశారు.

మాడుగుల కేంద్రంలో మూడు ఎంపీపీ పాఠశాలలకు గాను విద్యార్థులు సంఖ్యం తగ్గి పోవడంతో రెండు పాఠశాలలను మూసివేశారు. ఈ పాఠశాలలో చదివి రాజకీయంగా, ఉన్నతమైన ఉద్యోగాలలో పనిచేస్తున్నవారు పాఠశాల అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందిస్తున్నారు.

నేడు మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాల (గెడ్డబడి)లో ఐదుగురు ఉపాధ్యాయులు, 138 మంది విద్యార్థులతో కళకళ లాడుతుంది. 2021 జనవరి నెలలో గ్రామానికి చెందిన ఎస్ఎన్వ్‌డీ సూర్యనారాయణ తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న మండల పరిషత్ పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లోకి చేరారు. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30మంది ఉండేవారు. తాను చదువుకున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి ఎలాగైన పాఠశాలను అభివృద్ధి చెయ్యాలని నిర్ణయించుకొన్న సూర్యానారాయణ గ్రామంలో పెద్దలు సహాయ సహకారాతో 30 మంది విద్యార్థుల సంఖ్యని పెంచేందుకు గ్రామంలో ప్రతీ ఇంటికి తిరిగారు. 2024 నాటికి 130మంది విద్యార్థుల వరకు సంఖ్యని పెంచారు. 2025 జూన్ నెలలో మండల పరిషత్ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేశారు. ప్రస్తుత హెచ్ఎంలు మాడుగుల గ్రామానికి చెందిన కొప్పోజి శ్రీనివాసరావు, ఎస్ఎన్విడి సూర్యనారాయణ ఎంతో కృషి చేశారు. విద్యార్థులకు శులభ పద్దతిలో విధ్య నేర్పించడంతో పాటు తెలుగు సాంప్రదాయ పద్ధతులు, విలువలు నేర్పిస్తూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా పాఠశాలను తీర్చిదిద్దారు.అధ్యాత్మిక, సంస్కృతి, తెలుగు సాంప్రదాయాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పాఠశాల మెరుగుదలకు వాసవి క్లబ్ రెండేళ్లపాటు దత్తత తీసుకొంది. ఆరోహ ట్రైబల్ సొసైటీలతో పాటు స్వచ్చంద సంస్థలు కూడా ఈ పాఠశాల అభివృద్ధికి కషి చేశాయి. పూర్వపు విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి బెంచీలు అందించారు. నాడు-నేడులో మంజూరైన నిధులతో ప్రహారీగోడ నిర్మాణం టాయిలెట్స్ వంటి పనులు చేపట్టి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు స్టడీ అవర్స్ కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.



నిర్మించిన టాయిలెట్



చార్టులతో బోధిస్తున్న ఉపాధ్యాయులు

**విద్యార్థుల సంఖ్య 250 మందికి పైగా దాటిస్తాం**

వచ్చే ఏడాది 2026 జూన్ నెలలో జరిగే ఆడ్మిషన్లల్లో 250మంది వరకు విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నా మని హెచ్ఎం కోప్పోజి శ్రీనివాసరావు, ఎస్ఎన్డీ సూర్యనారాయణలు తెలిపారు. విద్యార్థులకు సరిపడా భవన వసతి సౌకర్యం ఉంటే సంఖ్యని పెంచి తీరుతామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా డిజిటల్ క్లాస్లు కూడా చెపుతున్నామన్నారు.

# ఎరువుల షాపుల్లో తనిఖీలు



నర్సీపట్నంలో తనిఖీ చేపడుతున్న ఆర్‌డిఒ

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:** పట్టణంలోని ఎరువు షాపులను ఆర్డీవో వి.వి రమణ ఆదివారం తనిఖీలు చేశారు. . రైతులు ఎరువులు గురించి ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆర్డిఓ రమణ మీడియా కు తెలిపారు. ఎవరైనా ఎరువుల అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల అమ్మకాలపై అధిక ధరలు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులను మోసం చేసి అధిక ధరలు వసూలు చేసే దుకాణదారులపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎరువుల నిల్వలు, బిల్లులు సక్రమంగా నమోదు చేయాలనీ, అక్రమంగా విక్రయాలు జరిపితే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎరువుల సరఫరా వ్యవస్థపై కఠిన నిఘా కొనసాగిస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జి.రమణ, తహసిల్దారు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**గొలుగొండ:** మండలంలోని ఏఎల్.పురంలో ఎరువులు, పురుగులు మందుల షాపులను కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తనిఖీ చేశారు. ప్రభుత్వ ధరలు ప్రకారం ఎరువులు, ఫెర్టిలైజర్స్ అమ్మకాలు చేపట్టాలని యాజమానులకు సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో రాజుబాబు పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలో దేవవరం, డొంకాడ, డొంకాడ కొత్తూరు, జి.జగన్నాథపురం గ్రామాల్లో ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతులు ఎరువులు వాడాలని సూచించారు. మోతాదుకు మించి ఎరువులు వాడటంతో జరుగు నష్టాలు గురించి వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఏఈఓ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ, పాల్గొన్నారు.

**గొలుగొండ:**యూరియా కొరతపై వస్తున్న వదంతులపై రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో ఆదివారం గ్రామసభ ఏర్పాటు చేశారు. రైతుల అవసరమైన యూరియాను ప్రభుత్వం సిద్దంగా ఉంచిందన్నారు. మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి పాల్గొన్నారు.

## సోలార్ కుళాయి ప్రారంభం

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** అరకులోయ మండలం లోతేరు పంచాయతీ తోడుబంధ గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో జల్ జీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన సోలార్ కుళాయిను ఆదివారం స్థానిక సర్పంచ్ గుబ్బాయి కళావతి ప్రారంబించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామస్తులు నూతనంగా నిర్మించిన కుళాయిను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో బీమ్మ, వార్డు సభ్యులు జి వెంకట్రావు, వైసిపి అధికార ప్రతినిధి జి.శ్రీరాములు, చెట్టి గెన్ను గ్రామస్తులు కిల్లో త్రినాథ్, భీమిడి లైకోన్, గ్రామ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** ప్రజలకు నాణ్యత తో పాటు అతి తక్కువ ధరకే బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని పిజిఎం ఆడమ్ కోరారు.ఆదివారం ఆడమ్ అధ్యక్షతన ఆదివారం ఇంటరాక్షన్ సెషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఎంలు, డిఇలు, ఎల్‌సిఓలు మరియు టీమ్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిజిఎం ఆడమ్ మాట్లాడుతూ, అక్టోబర్ వరకు అందిస్తున్న డిస్కౌంట్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. అత్యధిక స్పీడ్‌తో ఇంటర్నెట్, 400 ఛానల్ లను క్వాలిటీతో బీఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తుందన్నారు. 400 రూపాయలకే అన్ని సర్వీసులు అందిస్తుందని చెప్పారు. డిజిఎం సిఫ్ఎ బేగం బిఎస్ఎన్ఎల్ ఛానల్ భాగస్వాములతో మాట్లాడారు.




మాట్లాడుతున్న ఆడమ్

అక్టోబర్ 2025 వరకు అందుబాటులో ఉన్న డిస్కౌంట్లను తెలియజేస్తూ ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.



భోజనం ప్యాకెట్లు ఇస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

## భోజనం ప్యాకెట్లు అందజేత

**ప్రజాశక్తి -నక్కపల్లి:** రైసింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనాధలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, రైసింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి 15 రోజులకు ఆనాధలకు ఆహారం, దుస్తులు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి పాయకరావుపేటలో ఆనాధలకు భోజనం ప్యాకెట్లు అందజేశామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు.



కొట్టుకు పోయిన కాజ్‌వే

**కాజ్‌వే కొట్టుకుపోవడంతో**

## రాకపోకలకు కష్టాలు

**-మండల కేంద్రానికి వెళ్లాలంటే 20 కిలోమీటర్లు తిరగాల్సిందే**

**- ఇదీ మంగళాపురం, కుముందానిపేట, విఆర్ఆర్ పేట గ్రామాల ప్రజల పరిస్థితి**

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:** మండలంలో విజయరామ రాజుపేట సమీపంలో తాచేరు కాజ్‌వే కొట్టుకుపోవడంతో మండల కేంద్రం బుచ్చయ్యపేట రావాలంటే సుమారు 20 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సి వస్తుందనిమంగలాపురం, కుముండానుపేట, వి అర్అర్ పేట మూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

విజయరామరాజుపేట, కుముందానిపేట, మంగళాపురం గ్రామాల నుండి ప్రభుత్వ కార్యాలయాలకు రావడానికి మాడుగుల మండలం అప్పలరాజుపురం కస్పా జగన్నాధపురం, ఒంటరిలపాలెం, ముకుందపురం గ్రామాలు తిరిగి వడ్డాది మీదుగా బుచ్చయ్యపేట చేరుకోవాల్సి వసోతందని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు రెవెన్యూ,మండల పరిషత్, వ్యవసాయ శాఖ పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలకు వెళ్లి రావడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కాజ్‌వే పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టి, మూడు గ్రామాల ప్రజల రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు




కథలు చెపుతున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయధికారిణి దమయంతి ఆధ్వర్యాన నిర్వహించారు. చెడువారితో స్నేహం మంచిది కాదనే నీతి కథను విద్యార్థులకు వివరించారు. ముందుగా పిల్లలచేత నీతి కథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ, జనరల్ నాలెడ్జి పెంపొందించుకునేందుకు విద్యార్థులు వార్తాపత్రికలు చదవాలన్నారు. చంద్రగ్రహణం కోసం వివరించారు.



ఆలయ తలుపులు మూసివేసిన సిబ్బంది

## వెంకన్న ఆలయం మూసివేత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ప్రాచీన పుణ్య క్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1.50 నిమిషాలకు ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన ద్వారం తలుపులు, గర్భాలయ తలుపులను సిబ్బంది మూసివేశారు. ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా టిటిడి అధికారులు ఆదేశాల మేరకు ఆలయాన్ని మూసివేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు వెల్లడించారు.

## వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా సన్యాసిపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా స్థానిక నేత చింతకాయల సన్యాసి పాత్రుడను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు సోదరుడు సన్యాసి పాత్రుడు గతంలో తెలుగుదేశం పార్టీ వీడి వైసిపి పార్టీలో చేరారు. అప్పటినుండి జిల్లాలో రాజకీయాలను ప్రభావితం చేస్తూ వస్తున్నారు. ఆయన సోదరుడు సన్యాసి పాత్రుడికి ఇప్పుడు రాష్ట్ర స్థాయి పదవి పార్టీ బలపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సన్యాసి పాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటూ రాజకీయ పటిమను పెంచుకున్నారు. ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు ప్రాంతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని స్థానిక వైసిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా సన్యాసి పాత్రుడు వైసిపి బలోపేతం కోసం మరింత చురుకైన పాత్ర పోషించే అవకాశముంది.



జగన్‌తో సన్యాసిపాత్రుడు



సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వరప్రసాద్

## డిఎస్‌సి ర్యాంకర్లకు ఘన సత్కారం

ప్రజాశక్తి- కొత్తకోట:ఇటీవల విడుదలైన డిఎస్‌సి ఫలితాలలో రావికమతం మండలం కొత్తకోటలోని విద్యాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బోధిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు సెలక్ట్ అయ్యారు. ఈ స్కూల్‌లో బోధిస్తున్న ఉపాధ్యాయులు జోగినాయుడు( సోషల్ అసిస్టెంట్) కోలా సత్తిబాబు, మామిడి శ్రీనులు ఎస్జీటీలో ర్యాంకులు సాధించి సెలక్ట్ అయ్యారు. వీరిని స్కూల్ ప్రిన్సిపాల్ గట్టా వరప్రసాద్, రేవతిలు శాలువాతో సత్కరించారు.

## బెర్రీ బోరర్‌పై కాఫీ రైతులకు అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కొట్నా పల్లి, ఒల్డ, బాకూరు, పంచాయతీ మారేలా తదితర గ్రామాలో హార్టి కల్చర్, ఫీల్డ్ కన్సల్టెంట్ సిబ్బంది ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. హార్టి కల్చర్ కన్సల్టెంట్ కె.వాణి, ఫీల్డ్ కన్సల్టెంట్ పార్వతీశం, కె.రత్నలమ్మ, మండలం కోర్డినేటర్ గోవిందు పర్యటించారు.

# క్వారీ బ్లాస్టింగ్‌తో గృహాలకు బీటలు

## మైన్స్ అధికారులు తప్పుడు రిపోర్టు : సిపిఎం

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం శరభవరం పంచాయతీ రాజన్నపేట గ్రామంలో నల్లకాయి క్వారీలో బ్లాస్టింగ్‌తో ఇళ్ల బీటలు బారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు గ్రామాన్ని సందర్శించి బీటలు బారి పోతున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, స్థానికులు

ఆయన మాట్లాడుతూ, రాజన్నపేటకు 650 మీటర్ల దూరంలో క్వారీ ఉందన్నారు. గ్రామంలో 140 కుటుంబాలు జీవిస్తున్నాయని చెప్పారు. ఈ నల్లరాయి క్వారీలో బాంబ్ బ్లాస్టింగ్ శబ్దానికి 30 కుటుంబాలకు చెందిన ఇళ్ల సన్‌సైడ్‌లు, గోడలు బీటలు బారి పోయాయన్నారు. ఐదు టీవీలు బాంబుల శబ్దానికి పాడైయ్యాయని చెప్పారు. వీటితో పాటు ఐదు ఫ్యాన్లు కాలిపోయాయన్నారు. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. 2025 మార్చి 24న ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మైన్స్ అధికారులు క్వారీ ప్రదేశాన్ని పరిశీలన చేసి ఇక్కడ బ్లాస్టింగ్ జరగలేదని, అంతా సక్రమంగానే ఉందని చెప్పారన్నారు. ఇల్లు బీటలు వారిపోతుంటే బ్లాసింగ్ జరగలేదని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆర్డీవో స్వయంగా పరిశీలన చేయాలన్నారు. మైనింగ్



బీటలు బారిన ఇంటిని చూపుతున్న గృహస్తులు

అధికారుల తప్పుడు రిపోర్టుపై ఆర్డీవో విచారణ చేపట్టాలని, లేకుంటే జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి జీ.చంద్రరావు, జనసేన పంచాయతీ అధ్యక్షులు బి.కోటి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటుపరం కానివ్వం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గత ప్రభుత్వ హయాంలో స్థానిక మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ కృషితో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంతానికి కేటాయించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ఈ కూటమి ప్రభుత్వం పి పి పి పద్ధతి అంటూ ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడానికి చూస్తే ఊరుకునేది లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం హెచ్చరించింది. ఈ కుటిల ప్రయత్నాన్ని నర్సీపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం తరపున

వైసిపి విద్యార్థి విభాగం నేతలు



మాట్లాడుతున్న నాయకులు

తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేట్ పరం చేస్తే వైద్య విద్యను అభ్యసించాలని పేద మధ్యతరగతి కుటుంబాలు చదువుకు దూరం అవుతాయన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని తీసేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టిడిపి పేతలు ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ వైద్య కళాశాలలనే పిపిపి విధానమంటూ ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయాలని చూస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను పూర్తి చేయకుండా ప్రైవేట్ పరం చేయడానికి చూస్తుందన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు పరం చేసే చర్యలను తిప్పి కొట్టడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం తరపున ఆందోళనలకు కూడా సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, నాయకులు స్వామి, అప్పలనాయుడు, నాగేంద్ర రాధాకృష్ణ, వంశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# యూరియా సరఫరాలో విఫలం

## ప్రభుత్వం, అధికారుల పొంతన లేని ప్రకటనలపై రైతుసంఘం నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి -చోడవరం : రైతులందరికీ సరిపడా యూరియాను ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం చోడవరంలో జరిగిన సమావేశంలో రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత లేదని 72 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని,మరో పదిరోజుల్లో నలభై వేల టన్నుల యూరియా దిగుమతి చేస్తామనిముఖ్యమంత్రి ప్రకటించారని.అయితే అనకాపల్లి జిల్లాలో పరిస్థితి దానికి భిన్నంగా ఉందన్నారు. యూరియా లేక రైతులు అల్లాపోతుంటే 891 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, మరో 1500 టన్నులు అవసరం ఉంటుందనిజిల్లా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంత యూరియా అందుబాటులో ఉంటే రైతులకు ఎందుకు సరఫరా చేయలేద ప్రశ్నించారు. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా అమ్ముకాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల ద్వారా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.. ప్రభుత్వం నియమించిన మల్టీ డిసిప్లినరీ కమిటీలు ఎరువుల బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలపై దాడులు చేసి అరికట్టాలని, రైతులకు సరిపడా యూరియా సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరారు, లేకుంటే రైతులను సమీకరించి, ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న,, తెలయ్యబాబు, నరసింహామూర్తి, సాంబశివరావు, రామకృష్ణ,రాజు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో నరసింగరావు ప్రతిభ



అవార్డు స్వీకరిస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి-.అనకాపల్లి : ఏలూరు జిల్లా ద్వారక తిరుమల కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ అండ్ సీనియర్స్ యోగాసనా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ టీచర్ బుదిరెడ్డి నరసింగరావు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో పశ్చిమగోదావరి యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 45ఏళ్లపైబడిన విభాగంలో నరసింగరావు మొదటిస్థానం సంపాదించారు.నర్సింగరావుకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను యోగా అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్‌వి నరసింహరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ ఆర్‌కె వర్మ, జనరల్ సెక్రటరీ ఎం అవినాష్ అందజేసారు. నరసింగరావును గ్రామ మాజీ సర్పంచ్ బాబి, నడిపల్లి గణేష్, కర్రి జమ్మి, మార్దూరు అజయ్, నడిపల్లి బోసుబాబు, పల్లెల గణేష్, బుదిరెడ్డి సూరిబాబు గొంతిన శ్రీనివాసరావు, జివి.రావు, పన్నీరు చంటి అభినందించారు.

# కుక్కల స్వైర విహారంతో బెంబేలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం: అచ్యుతాపురం, మోసయ్యపేట పంచాయతీల పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పురవీధులలో ప్రధాన రహదారులపై అడ్డదిడ్డంగా, విచ్చలవిడిగా సంచరిస్తూ, పాదచారులు, ద్విచక్ర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గ్రామ పంచాయతీ, అధికారులు స్పందించి, కుక్కల బెడదను నివారించి రక్షణ కల్పించాలని మోసయ్యపేట గ్రామస్తులు కోరుతున్నారు.



మోసయ్యపేటలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

## ఉత్తమ ఉపాధ్యాయునికి అభినందన

ప్రజాశక్తి- కె. కోటపాడు మండల కేంద్రానికి చెందిన డెంకాడ పెంటారావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర హోంమంత్రి అనిత నుంచి అవార్డు స్వీకరణపై పలువురు అభినందించారు. ప్రస్తుతం నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెంటారావు, గతంలో మండలంలోని చంద్రయ్యపేటలో ఉపాధ్యాయుడిగా రెండేళ్ళు పనిచేశారు.

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు

**వర్ధనపు రవీంద్రనాథ్**
B.Sc., (Ag)
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్,
చోడవరం
చోడవరం డివిజన్, అనకాపల్లి జిల్లా.


# ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

## 45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

చోడవరం డివిజన్, అనకాపల్లి జిల్లా / సోమవారం 08-09-2025 / 8 పేజీలు


ప్రజాశక్తి 45 Anniversary GREETINGS

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు

**ప్రజాశక్తి అభిమాని**
మరియు సిబ్బంది - చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

# వ్యవసాయమే జీవనాధారం


అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు శుభాకాంక్షలు

ప్రో॥ **శిలపరశెట్టి శ్రీరామ్**
చౌడువాడ,
కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.

SNP
**SAI SRIRAM JOB CONSULTANCY**
Regd.No. 190/2018
WE ARE SUPPLING ALL KINDS OF MAN POWER
Office : Opp. Muthoot Finance, Beside ICICI Bank,
LANKALAPALEM, Visakhapatnam District, A.P.
Cell : 8639301392, 93908 11155
E-mail : saisriramjobplacements@gmail.com



వ్యవసాయ పనుల్లో మహిళలు

- చోడవరం, మాడుగులలో వేల ఎకరాల్లో వరి, ఇతర పంటల సాగు
- కీలక జలాశయాలన్నీ ఈ రెండు నియోజకవర్గాల్లోనే..
- ఖనిజ సంపదలు, ఏజెన్సీ ఉత్పత్తులకు ప్రసిద్ధి

ప్రజాశక్తి - చోడవరం, మాడుగుల విలేకరులు

**ఒకవైపు పుష్కల నీటి వనరులు, విశాల పల్లపు భూములు.., మరోపక్క వర్షాధారిత మెట్ట భూములు, ఇంకోవైపు సహజ వనరులు, ఖనిజ నిక్షేపాలు, కొండలు, లోయలు, సెలయేర్లు ఉన్న ఏజెన్సీ ప్రాంతం... ఇలా భిన్న ప్రాంతాల కలబోతగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాలను పేర్కొనవచ్చు. అనకాపల్లి జిల్లాలో ఈ రెండు ప్రాంతాలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి అమలు జరిపితే ఈ ప్రాంతం కొత్త పుంతలు తొక్కనుంది.**

కష్టించే పని చేసే రైతులు, పనుల కోసం సుదూర ప్రాంతాలకు వలస పోయే కూలీలు చోడవరం, మాడుగుల నియోజకవర్గ ప్రాంతాల్లో కనిపిస్తారు. ఎనిమిది రిజర్వాయర్లు ఇక్కడ ఉన్నాయి. వరి, చెరకు ప్రధాన పంటలు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఈ ప్రాంత ప్రజలు జీవిస్తున్నారు. దక్షిణాదిలోనే సహకార చక్కెర కర్మాగారాల్లో పేరెన్నికగన్న చోడవరం (గోవాడ) సహకార చక్కెర కర్మాగారం ఈ ప్రాంతంలోనే ఉంది. ప్రస్తుతం దీని నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఆధునీకరణ చేపట్టి, సమర్థవంతంగా నడపాల్సి ఉంది. అపరాలు, కూరగాయలు, సరుగుడు, జీడిమామిడి నుంచి కొత్తగా పామాయిల్, హైబ్రీడ్ వేపతోటలు, అరటి వంటి వాణిజ్య పంటలు ఈ నియోజకవర్గాల్లో పండుతాయి. ఖరీదైన గ్రానైట్, రంగురాళ్లు, మాంగనీస్ వంటి ఖనిజ నిక్షేపాలు ఇక్కడున్నాయి. మన్యం ప్రాంతాన్ని ఆధారం చేసుకొని పసుపు, పిప్పళ్లమోడి, విస్తర్లు వంటి వ్యాపారాలు ఇక్కడ సాగుతున్నాయి. మాడుగుల హల్వాకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. విస్తారంగా జీడి తోటలు, వాటి ఆధారంగా జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. మరో వైపు అభివృద్ధికి నోచని గిరిజన గ్రామాలు కూడా ఇక్కడే ఉన్నాయి.

ఈ నియోజకవర్గాలు రెండూ పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతాలు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలు చోడవరం నియోజకవర్గంగానూ, మాడుగుల, కె.కోట పాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాలు మాడుగుల నియోజకవర్గంగానూ ఉన్నాయి. వీటిలో చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల మండలాలు అధికశాతం నీటి వనరులు ఉన్న ప్రాంతాలు కాగా, కె.కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో అత్యధిక సాగు వర్షాధారమే. దీంతో ఇక్కడ భూములు ఎక్కువగా ఉన్నా పంటలు (మిగతా 8లో..)

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం

ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పేద ప్రజల అభ్యున్నతికి
అంకితమై సేవలందిస్తూ, అదే విధంగా ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి
తోడ్పాటు అందిస్తున్న పత్రికా సంపాదకులు,
ప్రతినిధులు, విలేకర్లు, సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**ది చోడవరం కో-ఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్**
**గోవాడ, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.**


శ్రీ వి.వెంకటరావు
డైరెక్టర్ ఆఫ్ సుగర్ & కేన్ కమీషనర్


శ్రీమతి విజయకృష్ణన్
I.A.S.,
జిల్లా కలెక్టర్ / పర్సన్ ఇన్‌ఛార్జీ


శ్రీ డి.వెంకటేశ్వరరావు
M.H.R.M.
మేనేజింగ్ డైరెక్టర్

ప్రజాశక్తి 45 Anniversary GREETINGS


ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పేద ప్రజల అభ్యున్నతికి
అంకితమై సేవలందిస్తూ, అదే విధంగా
ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న
పత్రికా సంపాదకులు,
ప్రతినిధులు, విలేకర్లు, సిబ్బందికి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**శ్రీమతి పి.లక్ష్మిదేవి**
తహశీల్దార్, దేవరాపల్లి.

**కె.అప్పారావు**
డిప్యూటీ తహశీల్దార్


**మండల వి.ఆర్.ఓ.లు**
దేవరాపల్లి

దేవరాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.




# గిరిజన ఫలాలకు కేరాఫ్.. కోనాం సంత

**ప్రజాశక్తి–చీడికాడ:** మండంలోని కోనాం సంతలో పలు రకాల గిరిజన ఫలాలు లభిస్తుంటాయి. సంతకు వివిధ గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు అనేక రకాలైన ఫలాలను తీసుకొస్తుంటారు. చీడికాడ మండలం కోనాంలో గిరిజన సంతకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రజలతో పాటు పాడేరు, తూర్పుగోదావరి జిల్లాల నుండి ప్రజలు, వ్యాపారస్తులు వస్తుంటారు. ఈ సంతలో లభించే వివిధ రకాల ఫలాలను ముఖ్యంగా పనస, మామిడి పండ్లు, జీడి పిక్కలు, పైనాపిల్, సీతా ఫలాలతోపాటు కొండ చీపుర్లు అనేక రకాలైన కూరగాయలు విస్తారంగా లభిస్తాయి. దీంతో ఈ కోనాం గిరిజన సంతకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వారంలో ప్రతి గురువారం జరిగే ఈ సంత లో సీజనల్‌గా దొరికే ముఖ్యంగా చింతపండుకు ప్రత్యేక స్థానం కలదు. ఈ సంతకు సుమారు చుట్టుప్రక్కల 13 చిన్న చిన్న గిరిజన గ్రామాలు సరిహద్దుగా ఉన్నాయి. గిరిజనులు ప్రతి గురువారం చింతపండు, పైనాపిల్, పనస పండ్లు,






సీతాఫలం, బత్తాయి, నిమ్మ నారింజ పండ్లతోపాటు కొండ చీపుర్లు అనేక రకాల దుంపలతోపాటు కూరగాయలను కూడా గిరిజనులు తెచ్చి అమ్ముతారు. వారి జీవనోపాధికి కావలసిన ఆహార పదార్థాలను, కిరాణా సామాన్లతో పాటు తినుబండారులను కూడా వారానికి అవసరయ్యేటట్లు సామానులను కొనుక్కొంటారు.

ఈ సంతలో ముఖ్యంగా ప్రకృతి పరంగా పండే పంటలు, పండ్లు, కాయలు లభిస్తాయి. దీంతో, అనేకమంది ప్రజలు, వ్యాపారస్తులు వచ్చి అధిక మొత్తంలో కొనుక్కొని మిగతా మండలాల్లోని గ్రామాల్లో వ్యాపారాలు సాగిస్తుంటారు. ఈ సంత మండలంలో మారుమూల ప్రాంతంలో ఉన్నప్పటికీ కూడా పెద్దపెద్ద వాహనాలు, ఆటోలు, మోటార్ వాహనాలపై వచ్చి అవసరమైన కూరగాయలు, పండ్లు కొనుక్కొని వచ్చి వెళ్తారు. దీంతో, గ్రామంలో అనేకమంది చిరు వ్యాపారులకు జీవనం లభిస్తుంది.





ఈ సంతకు ఉమ్మడి విశాఖ జిల్లాలోనే కాకుండా దేవరా పల్లి, చీడి కాడ, బుచ్చ య్యపేట, చోడవరం, మాడుగుల మండలాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రకృతి పరంగా లభించే పండ్లు, ఫలాలను ప్రజలు వచ్చి కొనుక్కొని వెళు తుంటారు.







## ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి.. వడ్డాది వెంకన్న ఆలయం



**ప్రజాశక్తి -వడ్డాది :** శతాబ్ధమున్న చరిత్ర కలిగిన వడ్డాది వెంకన్న ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రముఖ దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయానికి చారిత్రక ప్రాచుర్యమూ ఉంది. సింహాచలం దేవస్థానం శాసనాల్లో పేరొన్న ఆధారాలు ఆధారంగా మహాభారతంలో పాండవులు అజ్ఞాతవాస సమయంలో విరాటరాజు పాలించిన మత్స్యదేశ రాజధాని విరాటపురమే నేటి వడ్డాది అని, పాండవులు గిరిజాంబ గిరిని అనుకొని ఉన్న చెరువులో స్నానమాచరించి, సంధ్యా వందనం చేసేవారని, కనుక ఆ చెరువును పాండవుల చెరువుగా ప్రాచుర్యం పొందినట్లు చెబుతారు.

### స్థల పురాణం

వడ్డాది వెంకన్న ఆలయానికి ఘన చరిత్ర ఉంది 150 ఏళ్ల క్రితం శ్రీమన్నారాయణ భట్ అనే యోగి వచ్చి, వడ్డాదికి దక్షిణ దిశగా వెంకటేశ్వర స్వామి అవతరిస్తాడని, అదే పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుందని చెప్పి దేశ సంచార నిమిత్తం వెళ్లి పోయాడని చెబుతారు. యోగి వెళ్లిన మరుసటి ఏడాది గిరిజాంబగిరికి ఉత్తర దిశలో విజయరామరాజుపేటలో కాళ్ల వంశస్థులు బావిని తవ్వుతుండగా పది అడుగుల లోతులో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహాలు బయటపడ్డాయి. ఈ విషయాన్ని అప్పటి గ్రామపెద్ద దొండా భగవంతులయ్య దొర దృష్టికి తేగా, తవ్వకాల్లో లభ్యమైన విగ్రహాలను వడ్డాది గిరిజాంబగిరికి రప్పించి, దేవాలయ నిర్మాణం చేపట్టి, విగ్రహ ప్రతిష్ట చేయించారు. ఆనాటి నుండి నేటివరకు ఏటా స్వామికి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేవాలయ నిర్వహణకు 60 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. 1970లో వెంకన్న ఆలయం దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్ళింది.

### ఏటా ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా శివరాత్రి రోజున స్వామి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. పెళ్లిరాటతో వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతారు. ఏటా పాల్గుణశుద్ధ వైకుంఠ ఏకాదశికి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవాలను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఏకాదశి ముందు రోజు రాత్రి దొంగ పెళ్లితో ప్రారంభమై, పుష్పాంజలితో ఉత్సవాలు ముగుస్తుంది. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, తిరు కల్యాణోత్సవాలు, నాగవల్లి, తిరువసంతోత్సవం, చక్రస్నానం వంటి వేడుకలను వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తుంటారు.









# నోరూరించే మాడుగుల హల్వా

## దేశంలోనే విశేష గుర్తింపు

**ప్రజాశక్తి- మాడుగుల:**
ఒక్కసారి రుచి చూస్తే చాలు మళ్లీ మళ్లీ రుచి చూడాలనే విధంగా నోరూరిస్తుంది గోదుమపాలతో తయారు చేసిన మాడగుల హల్వా. అనకాపల్లి జిల్లా మాడుగుల గ్రామం పేరు వినగానే రాష్ట్రమే కాదు దేశంలో అనేక ప్రాంతాలలో సైతం ఇక్కడ తయారయ్యే మెత్తమెత్తని రుచికరమైన నోరూరించే హల్వానే గుర్తుకు వస్తుంది. అతి రుచికరమైన ఈ హల్వా గురించి తెలియవారు ఉండరంటే అతిశయోక్తి కాదు.

రాష్ట్రంలో తాపేశ్వరం మడతకాజా, కాకినాడ కాజా, బందరు లడ్డూ, ఆత్రేయపురం పూతరేకులు ఇలా తీపి పదార్థాలకు ఆ ప్రాంతాలకు ఏ విధంగా పేరు ఉందో ఇక్కడ గోదుమ పాలతో తయారు చేసే మాడుగుల హల్వా కు సైతం అలాంటి గుర్తింపే ఉంది.గోదుమపాలు, పంచదార, నెయ్యి, జీడి, బాదం పప్పులతో ఈ హల్వాను తయారు చేస్తారు.

మాడుగుల గ్రామానికి చెందిన దంగేటి ధర్మారావు 1890 సంవత్సరంలో స్థానిక రావిచెట్టు జంక్షన్ వద్ద హెూటల్ ఏర్పాటు చేసి వారానికో రకమైన స్వీట్స్ తయారు చేసేవారు. ఓ దఫా అనుకోకుండా చేసిన గోధుమపాల హల్వా అత్యంత రుచికరంగా ఉండటంతో, అధికంగా అమ్ముడు పోవడమే కాకుండా బాగా గిరాకీ ఏర్పడింది. అప్పటినుంచి హల్వా తయారీపై దృష్టి సారించి, ఈ వ్యాపారం ప్రారంభించినట్లు ప్రస్తుత వ్యాపారం చేస్తున్న ధర్మారావు వారసులు తెలిపారు. గోదుమపాలతో ప్రయోగాత్మకంగా తయారు చేయడంతోనే మాడుగుల హల్వా పేరు నలుదిశలు వ్యాపించింది.



ఈ హల్వా తయారీ సులభతరం కాదు. కష్టంతో కూడుకున్న పనే. హల్వా తయారీ ప్రారంభించిన కొన్నేళ్ల వరకూ నోటిలో వేసుకుంటే జిగురుగా సాగినట్టు ఉండేది. ప్రస్తుతం మాత్రం నోటిలో వేసుకుంటే ఇట్టే కరిగిపోయే విధంగానే తయారు చేస్తున్నారు. హల్వా వ్యాపారం ప్రారంభంలో దంగేటి వారి కుటుంబీకులు చేస్తే ప్రస్తుతం వారితోపాటు దాసరి కుటుంబాలకు చెందిన వారే కాకుండా పలువురు కూడా వ్యాపారం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అనేకమంది వర్తకులు పిప్పలి వ్యాపారం చేస్తూ ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి నగరాలకు నిరంతరం రాకపోకలు సాగిస్తూ ఇక్కడ తయారు చేసే హల్వాను తీసుకువెళ్లి బందువులకు. స్నేహితులకి ఇస్తుంటారు. దీంతో ఇక్కడ తయారయ్యే హల్వా వంటకం రుచి నగరాలకు పాకిపోయి ఎప్పటికప్పుడు ఆర్డర్స్ తెప్పించు కొంటుంటారు. దీంతో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అనేక మందికి హల్వా రుచి ఇష్టంగా మారిపోయింది. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్



క్వింటన్ మన రాష్ట్రానికి వచ్చిన సమయంలో ఈ హల్వాను రుచిచూశారు. మన దేశంలో గల ప్రముఖ నాయకులంతా హల్వా రుచి చూసిన వారే. నెయ్యి హల్వా రూ 500 నుంచి 600, డాల్డా, నెయ్యి మిక్సింగ్‌తో తయారైన ఆర్థినరీ హల్వా రూ.300 400 విక్రయిస్తున్నారు.

### హల్వా తయారీ విధానం

గోదుమలు నీటిలో నానబెట్టి మూడు రోజుల తరువాత రుబ్బురోలులో వేసి రుబ్బాలి. రుబ్బిన తరువాత వచ్చిన పాలను తీసి పులుపు వచ్చేవరకూ ఒక రోజు నిల్వ ఉంచాలి. తరువాత పాకం కలాయి పొయ్యిపై పెట్టి రెండు లీటర్లు నీరు, ఏడు కిలోల పంచదార కలిపి మరిగించాలి. పాకం వచ్చాక నాలుగు లీటర్ల గోదుమపాలు వేయాలి. నెయ్యి లేదా డాల్డా మూడు లీటర్లు వేయాలి. పాకం మరుగుతుండగానే పావు కిలో జీడిపప్పు, బాదంపప్పు వేయాలి. పాకం దిగిన 10నిమిషాలు తరువాత కిలో జీడిపప్పు వేయాలి. హల్వా తయారు చేసే విధానం ఇది. హల్వా మహిళలు తయారు చేసి పల్లాల్లో వేసి షాపులకు తరలిస్తారు. ఇది ఎంతో రుచికరంగా ఉండటంతో అంతా లొట్టలేసుకుని ఆరగిస్తారు.

ప్రతీ అక్షరం - ప్రజల పక్షం అనే నినాదంతో దినదినాభివృద్ధి చెందుతూ, 45వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇవియే హృదయపూర్వక శుభాకాంక్షలు
ప్రజాశక్తి 45th ANNIVERSARY Greetings
అధ్యక్షులు: కె.శ్రీనివాస్
కార్యదర్శి: ఎ.ప్రశాంత్
ఉపాధ్యక్షులు: ఎ.ప్రసాద్
మరియు పాలకవర్గ సభ్యులు బంగారుమెట్ట
బంగారుమెట్ట విశ్వబ్రహ్మణ సంఘం
బుచ్చయ్యపేట మండలం, అనకాపల్లి జిల్లా.



ప్రజాశక్తి 45 Anniversary GREETINGS
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
డా॥ బి.శ్రీనివాసరావు
B.V.S.C & A.H. సహాయ సంచాలకులు
ఏరియా పశువైద్యశాల-చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.


# కొండల మధ్య కనువిందు.. కోనాం జలాశయం



**ప్రజాశక్తి-చీడికాడ:** కొండల మధ్య ఉన్న కోనాం జలాశయం పర్యాటకుల మదిని దోచేస్తోంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ఈ జలాశయాన్ని వీక్షించేందుకు వస్తుంటారు. అలాగే వందలాది ఎకరాలకు కోనాం పాలవెల్లి జలాశయం సాగు నీరు అందిస్తోంది. పంటలు సుభిక్షంగా పండుతు న్నాయంటే దానికి కారణం కోనాం పాలవెల్లి జలాశయమే.

ఈ జలాశయాన్ని 1979లో నిర్మించారు.ఈ జలాశయం మొత్తము 24 మిలియన్ క్యూబిక్ మీటర్స్ నీరును నిలువ చేస్తుంది .ఇది కొన్ని వందల ఎకరాలకు నీరు అందిస్తుంది. పక్క మండలాలు బుచ్చయ్యపేట మండలంలోని కొన్ని గ్రామాలతో పాటు చోడవరం మండలంలో పలు గ్రామాలకు కూడా సాగునీరు సరఫరా అవుతోంది. చీడికాడ మండలంలోని కోనాం గిరిజన పంచాయతీలో నిర్మించిన ఈ జలాశయం పాలవెల్లి జలాశయంగా పిలవబడుతుంది. దీనికి కారణం వినాయకుని పండగలో పాలవెల్లి పదాన్ని గుర్తు చేస్తుంది. ఈ జలాశయాన్ని తిలకించుటకు విశాఖ ఉమ్మడి జిల్లాలతో పాటు విజయనగరం జిల్లాలోని పలు గ్రామాల నుండి కూడా ప్రజలు, యువత వచ్చి జలాశయం అందాలను తిలకిస్తుంటారు.

ముఖ్యంగా ఈ జలాశయం రెండు, మూడు కొండల మధ్య విస్తారంగా విస్తరించి ఉంది. జలాశయం చుట్టు పక్కల గిరిజన గ్రామాలకు తారు రోడ్లు నిర్మించడంతో రాకపోకలకు వాహనదారులకు పాదచారులకు కూడా ఎంతో సులువుగా ఉండటంతో ప్రతి ఏటా కూడా టూరిస్టులు సంఖ్య పెరుగుతోంది. దీంతో ఎంతోమంది జలాశయంలో బోట్లు ద్వారా ప్రయాణం చేసి అందాలను వీక్షిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ గిరిజన గ్రామమైన కోనాం ప్రజలకు ఈ జలాశయం మత్స్య సంపదను అందించడంతోపాటు బోటు విహారంగా కూడా ఆర్థిక లాభాన్ని చేకూర్చుతోంది.





ప్రజాశక్తి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
ఎ.రామారావు
తహశీల్దార్, చోడవరం
మండల తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది
చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి 45 Anniversary GREETINGS
ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పేద ప్రజల అభ్యున్నతికి అంకితమై సేవలందిస్తూ, అదే విధంగా ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న పత్రికా సంపాదకులు, ప్రతినిధులు, విలేకర్లు, సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సన్‌రైస్ గ్రానైడ్ కంపెనీ
కె.కోట్నాబిల్లి గ్రామం
టి.అర్జాపురం, రావికమతం మండలం,
అనకాపల్లి జిల్లా.

ప్రజాశక్తి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
HP GAS your friendly gas
Ph : 08934-245686
Cell : 9866275886
జొనండి!
HP GAS
SIMHADRI SAI DURGA
HP GAS AGENCIES
# 19-754, Main Road, Kothuru,
Chodavaram, Anakapalli District-531036
E-mail : simhadrisaidurga.ankapalli@hpgas.hpcl.co.in



ప్రజాశక్తి 45 Anniversary GREETINGS
అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో
45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
బి.రామన్నదొర H.W.O.
బి.సి.బాయ్స్ హాస్టల్ - దిబ్బిడి
బుచ్చయ్యపేట మండలం, అనకాపల్లి జిల్లా.























# ప్రశ్నార్థకంగా.. గోవాడ సుగర్స్ నడక



**ప్రజాశక్తి చోడవరం:** గోవాడ చక్కెర కర్మాగారం నడక ప్రశ్నార్థకంగా మారింది. ఒకానొకప్పుడు లక్షల టన్నులు క్రషింగ్ జరిపిన ఫ్యాక్టరీ ప్రస్తుతం వేల టన్నులకు చేరింది. వచ్చే క్రషింగ్ సీజన్‌కు నడుస్తుందో లేదో అన్న అనుమానం నెలకొంది. ఫ్యాక్టరీ పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో 32 వేల ఎకరాల్లో చెరుకు సాగు




అయ్యేంది. ప్రస్తుత సాగు 3000 ఎకరాలకు పడిపోయింది. జూన్ నెల ఆఖరుకు చెరుకు నాట్లు పూర్తయ్యేవి. ప్రస్తుతం ఎక్కడా నాట్లు వేయని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది ఒక లక్షా 9,000 టన్నుల క్రషింగ్ జరిగింది. దీనిలో 14 వేల టన్నులకు మాత్రమే టన్నుకు మూడు వేల రూపాయలు చొప్పున బట్వాడా జరిగింది. ఇంకా సుమారు రైతులకు 30 కోట్ల వరకు బకాయి ఉంది. కార్మికులకు ఏడు కోట్లు, జీఎస్టి కోటి 50 లక్షలు, ఇవ్వవలసి ఉంది. ప్రస్తుతం ఉన్న పంచదార మొలాసిస్ ద్వారా పది కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుస్తుంది. అలాగే వచ్చే సీజన్కు క్రషింగ్ ప్రారంభం జరగాలంటే పాత బకాయిలతో పాటు యంత్ర సామాగ్రి పెట్టుబడి 12 కోట్ల వరకు అవసరమవుతుంది. అంటే సుమారుగా 50 కోట్ల రూపాయలు ఉంటే తప్ప వచ్చే ఏడాది ఫ్యాక్టరీ నడిచే పరిస్థితులు కనపడలేదు.

**చెరుకు పంటకు రైతుల దూరం**

గిట్టుబాటు కాకపోయినా ఫ్యాక్టరీ ఇచ్చే అరకొర ధరతో రైతులు చెరుకు సరఫరా చేసేవారు గత రెండేళ్లుగా సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు ఇవ్వకపోవడంతో చెరుకు సాగు చేయడానికి రైతులు మక్కువ చూపలేదు. అదనపు సౌకర్యాలు మాటలాగున్నా కనీసం చెరుకు సరఫరా చేసిన వాటికి చెల్లింపులు జరిగితే చెరుకు సాగు చేసేవారిని రైతులంటున్నారు. దీంతో సరుగుడు, కొబ్బరి, యూకలిప్టస్ వంటి వైపు వెళుతున్నారు. ఏడాది సాగు విస్తీర్ణాన్ని బట్టి చూస్తే ఫ్యాక్టరీకి 20 వేల నుండి 30 వేల టన్నులకు మించి చెరుకు రాను పరిస్థితి కనపడుతుంది. ఈ చెరుకుతో నిర్వహణ సాధ్యం కాదని ఫ్యాక్టరీ వర్గాలు అంటున్నాయి. పొమ్మనకుండా పొగా పెట్టిన చందంగా రైతులను ప్రభుత్వాలు చెరుకు పంటకు దూరం చేశాయని రైతులను అంటున్నారు.

**ఆదుకోని కూటమి ప్రభుత్వం**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు గోవాడ చక్కెర కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎంపీ సీఎం రమేష్ వంటి వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఒడిదుడుకులతో కొట్టుమిట్టాడుతున్న షుగర్ ఫ్యాక్టరీ కి కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు మొండిచేయి చూపిందని చెప్పవచ్చు.

# పంచదార చిలుకల తయారీలో ప్రసిద్ధి వడ్డాది

**ప్రజాశక్తి-వడ్డాది:** సకల శుభాలకు చిహ్నాలుగా భావించే పంచదార చిలుకల తయారీలో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే వడ్డాది ఎంతో ప్రసిద్ధి చెందింది. పండుగలు, తీర్థాలు, ఉత్సవాలు, వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో పంచదార చిలుకలు ఉపయోగిస్తారు. ఇవి లేకుండా ఉండవంటే వీటికి ఎంత ప్రాముఖ్యత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దీంతో వీటికి భలే డిమాండ్ ఉండటంతో వీటి తయారీనే జీవనాధారంగా చేసుకుని ఎందరో వడ్డెర కులస్తులు జీవనం సాగిస్తున్నారు. వివిధ ఆకృతు లతో నోరూరించే పంచదార చిలకలను తయారు చేయడంలో వడ్డాదిలోని వడ్డెర కులస్తులు సిద్ధహస్తులు.












ఉమ్మడి విశాఖతో పాటు ఇతర జిల్లాల నుంచి పంచదార చిలకల కోసం అనేక మంది వడ్డాది వస్తారంటే అతిశయోక్తి కాదు. వడ్డాది పెద్ద బజార్ వీధిలోనూ, వెంకటేశ్వర ముఖద్వారం దగ్గర రోడ్డు పక్కన ఉండే వడ్డెర కులస్తులు పంచదార చిలుకలను తయారు చేస్తుంటారు. పండుగలు, తీర్థాలు, ఉత్సవాలు, వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో పంచదార చిలుకలకు మంచి డిమాండ్ ఉటుంది. ఈ ప్రాంతంలో వివాహాల సమయంలో పెళ్లి కుమార్తెకు పెట్టే సారెలోనూ పంచదార చిలుకలు తప్పనిసరి. సకల శుభాలకు పంచదార చిలుకలను చిహ్నాలుగా ఇక్కడ ప్రజలు భావిస్తారు.



చిలుకల తయారీలో మహిళ

వడ్డాదిలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో కూడా వీటిని ఎక్కువగా విక్రయిస్తారు. ఇక్కడ తయారుచేసే పంచదార చిలుకలను ఉభయ గోదావరి జిల్లాలకు, ఒడిశాకు తరలిస్తుంటారు. కొంతమందికి వడ్డాది ప్రజలు వీటిని బహుమతి గానూ ఇస్తుంటారు. చాలా ఇళ్లల్లో స్వీట్‌తో తయారు చేసిన పంచదార చిలుకలను తమ ఇళ్లలో కొద్ది రోజుల పాటు అలంకారంగా దాచుకుంటారు.

**రుచి, ఆకృతి ప్రత్యేకం**

మంచి రుచితో పాటు చక్కని ఆకృతి వడ్డాది పంచదార చిలుకల సొంతం. ప్రసిద్ధి చెందిన తాజ్‌మహల్, వయ్యారి భామలు.. ఇలా పలు ఆకృతుల్లో వీటిని తయారు చేస్తారు. వీటితో పాటు కాజాలు, లడ్డూలు, మైసూర్ పాక్ వంటి మిఠాయిలను తయారు చేయడంలో వడ్డాది వడ్డెరలు సిద్ధహస్తులు. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే వీరు బిజీబిజీగా ఉంటారు. ఇంటిల్లిపాది కష్టపడుతూ చిలకలను తయారు చేస్తుంటారు.

వీటి తయారీలో వడ్డెరలు ఎంతో శ్రమిస్తారు. ఎండకు మండిపోతున్నా వేసవిలో కూడా వీరు కట్టెల పొయ్యి పెట్టి పంచదార చిలకలు, ఇతర మిఠాయిలు తయారు చేస్తూ జీవనం సాగిస్తారు. వడ్డాది వడ్డెర జీవితం మాత్రం కష్టాలమయమే. ఇంటిల్లిపాది రోజంతా కష్టపడితే మనిషికి రూ.400 నుంచి రూ.600 వరకు గిట్టుబాటు అవుతుందని ఇక్కడ మిఠాయి తయారీదారులు చెబుతున్నారు. పెళ్ళిళ్లు, శుభకార్యాల సీజన్ మినహాయిస్తే మిగతా సమయాల్లో ఖాళీగానే ఉండాల్సి వస్తోంది. ఆ సయమంలో జీవనోపాధి కష్టమౌతోందని చెబుతున్నారు.

**బతుకు దుర్భరమై వలసబాట**

ఒకప్పుడు వడ్డాదిలో వడ్డెర కులస్తులు 200 కుటుంబాలుగా ఉండేవారు. సరైన జీవనోపాధి లేకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడం వంటి కారణాలతో కొన్ని కుటుంబాల వారు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. పట్టణాలలోని స్వీట్లు దుకాణాల్లో కూలి పని చేసుకుంటున్నారు. కొంతమంది మాత్రం ఉపాధి ఉన్నా, లేకపోయినా ఇక్కడే ఉండిపోయారు. చిలుకల తయారీలో భాగంగా పొయ్యి వద్దే ఉండాల్సి రావడంతో పొగతో తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని వీరు ఆవేదన చెందుతున్నారు.

# బొమ్మల తయారీలో భళా.. చౌడువాడ



బొమ్మలు తయారు చేస్తున్న కళాకారుడు

**ప్రజాశక్తి - కె.కోటపాడు**

మండలంలోని చౌడువాడ గ్రామం అన్ని రకాల బొమ్మల తయారీకి ప్రసిద్ధి గాంచింది. గౌరీ పార్వతులు, దుర్గాదేవి, వినాయక బొమ్మలు తయారు చేస్తుంటారు. గ్రామంలో ఉన్న కుమ్మరి వృత్తిదారులు సీజనల్‌గా ఈ బొమ్మలను తయారు చేస్తున్నారు. గ్రామంలో ఉన్న కుమ్మరులు గతంలో జీవనోపాధి కోసం మట్టితో నేల కుండీలు, గోళేలు, జాడీలు, కుండలు తయారుచేసి గ్రామంతో పాటు పరిసరాల గ్రామాలకు తీసుకువెళ్లి డబ్బులు, ధాన్యము. సిరి ధాన్యాలకు అమ్ముకొని జీవనం సాగించేవారు. కాలక్రమేణా మట్టి పాత్రలు పోయి ప్లాస్టిక్, స్టీలు, ఇత్తడి వంటి పరికరాలు అందుబాటులోకి రావడంతో వీరి వృత్తి పూర్తిగా దెబ్బతింది. పూర్వం నుంచి వృత్తిపై ఆధారపడి బతకడం తప్ప ఎటువంటి స్థిరాస్తులు లేకపోవడంతో జీవనానికి కష్టం అవుతున్న తరుణంలో ఈ బొమ్మల తయారీ వృత్తిని ఎంచుకున్నారు. వీరికి మొదటినుంచి వివిధ రకాల ఆకృతులతో మట్టి పాత్రలు తయారు చేయడం అలవాటు ఉండటంతో సు లువుగా వినాయక విగ్రహాలు తయారు చేయడం ప్రారంభించారు. గ్రామంలో ఆరు కుటుంబాలు ఈ బొమ్మల తయారీని ఎంచుకున్నారు. వారితోపాటు గ్రామంలో ఉన్న పురుషులు మహిళలకు సుమారుగా ఆరు నెలల వరకు ఈ బొమ్మల తయారీలో పని కల్పిస్తున్నారు. జీవనం బాగానే సాగుతుండగా బయట ప్రాంతాల్లో కూడా బొమ్మల తయారీ పెరగడం, బొమ్మల తయారీకి కావలసిన సామాగ్రి రేట్లు, కూలీల రేట్లు పెరిగాయి. దీంతో ఆశించిన ధర రాకపోవడంతో మళ్లీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు తయారుచేసిన బొమ్మలు విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా, విశాఖపట్నంతోపాటు ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వారు కూడా ఇచ్చి తీసుకెళ్తుంటారు. కొంతమంది మధ్యవర్తులు వీటిని ఏకమొత్తంలో కొని తీసుకువెళ్లి ఆయా ప్రాంతాలలో విక్రయాలు చేపడుతుంటారు. ఇటీవల కాలంలో కొన్ని గ్రామాలలో ఈ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నప్పటికీ చౌడువాడలో తయారు చేస్తున్న విగ్రహాల కన్నా ధర ఎక్కువ, క్వాలిటీ లేకపోవడంతో ఎక్కువమంది విగ్రహాలకు ఇక్కడికే వస్తూ ఉంటారు. వినాయక చవితి పది రోజులు ఉండగానే వ్యాపారులచే గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడుతుంది. ఇందువలన బొమ్మల తయారు చేసే వాళ్లతో పాటు గ్రామంలో ఉన్న చిన్న పెద్ద వ్యాపారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వీటితో పాటుగా గౌరీ పార్వతుల విగ్రహాలు, దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలు కూడా ముందుగా ఆర్డర్ ఇచ్చిన వారికి తయారు చేస్తుంటారు. వీరు అన్ని రకాల విగ్రహాలు తయారుచేసి విక్రయిస్తుంటారు. ఆశించినంత ఆదాయం లేకపోయినప్పటికీ గ్రామంలోనే బతుకుతూ కొంతమందికి ఉపాధి కూడా కల్పిస్తున్నారు. ఈ బొమ్మల తయారీ వల్ల చౌడువాడ గ్రామంలో మంచి కళాకారులు ఉన్నారని గుర్తింపు వచ్చింది. వీరు మరింతగా విగ్రహాలు తయారు చేయుటకు కావలసిన సామాగ్రిని ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తే మరిన్ని విగ్రహాలు తయారు చేస్తామని, ఇంకా ఎక్కువమందికి పని కల్పిస్తామని గ్రామంలో ఉన్న విగ్రహాల తయారు చేస్తున్నవారు అంటున్నారు.

# ప్రకృతి ఆభరణం.. రైవాడ



రైవాడ జలాశయం

**ప్రజాశక్తి- దేవరాపల్లి**

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో ప్రకృతి ఆభరణంలా రైవాడ జలాశయం దర్శనమిస్తోంది. చుట్టూ పచ్చని కొండలు, అడవులు, పొలాలతో కమ్ముకొని పర్యాటకులను ఆహ్వానిస్తోంది. ఉదయం సూర్యోదయ సమయంలో కొండలపై కమ్ముకొనే మబ్బులు, ఆ మబ్బుల్లోంచి జలాశయానికి ప్రతిబింబమయ్యే సూర్యకిరణాలు చూసినవారిని మంత్రముగ్ధులను చేస్తాయి. రైవాడ రిజర్వాయర్‌కు ఎగువన ఉన్న చల్లగెడ్డ, గొర్రెగెడ్డ ప్రాంతాల నుంచి ప్రవహించే జలధారలు ఇక్కడికి చేరి జలాశయానికి నిత్యస్రవంతిని అందిస్తాయి. ఈ నీటితో చుట్టుపక్కల రైతులు సాగు సాగిస్తూ పంటల పండుగను జరుపుకుంటారు. కనుచూపు మేర పొలాల పచ్చదనం జలాశయానికి కొత్త అందాన్ని తెస్తోంది.

దేవరాపల్లి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో సరియా జలపాతం మరో ప్రత్యేకతగా ఉంది. దట్టమైన అడవుల మధ్య పచ్చటి చెట్ల పొదల వెనుకనుంచి ఉధృతంగా దూసుకొచ్చే జలపాతాన్ని చూసి "బాహుబలి వాటర్ ఫాల్స్" అని పిలవకుండా ఉండలేరు. వేసవికాలం గానీ, వానాకాలం గానీ వచ్చిన సందర్శకులు ఈ జలపాతం దగ్గర కాసేపు గడిపి నిశ్చలమైన ప్రకృతి ఒడిలో లీనమైపోతారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వీకెండ్లలో తరలివచ్చి రైవాడ జలాశయం, సరియా జలపాతం అందాలను ఆస్వాదిస్తున్నారు. కొందరు కుటుంబాలతో వస్తే, మరికొందరు ఫొటోగ్రఫీ కోసం ప్రత్యేకంగా వస్తున్నారు. యువత కోసం ఇది ఒక మినీ ట్రెక్కింగ్ డెస్టినేషన్‌గా మారింది. అయితే రోడ్ల అభివృద్ధి, పర్యాటక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో అధికారుల దృష్టి పడితే ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రముఖ పర్యాటక కేంద్రమై వెలుగొందే అవకాశముంది. స్థానిక ప్రజలు కూడా ఈ ప్రాంతంలో హోటల్, గైడ్ సర్వీస్, బోటు ప్రయాణాలు వంటి సౌకర్యాలు కలిస్తే తమ గ్రామీణ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రకృతి ఒడిలో విహరించాలనుకునే వారికి రైవాడ జలాశయం, సరియా జలపాతం ఒక అద్భుతమైన ఆహ్వానం.


## ఆకర్షిస్తున్న సరియా జలపాతం





















# విస్తర్ల తయారీలో మేటి కొత్తకోట

- కుటీర పరిశ్రమగా అభివృద్ధి
- వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష, పరోక్ష జీవనోపాధి

ప్రజాశక్తి -కొత్తకోట : విందు ఎవరిదైనా, ఎక్కడైనా అవసరమైన విస్తరాకులను అందివ్వడానికి మేము సిద్ధం అంటోంది కొత్తకోట. దశాబ్దాలుగా ఇక్కడ విస్తరాకుల తయారీ ఒక కుటీర పరిశ్రమగా విరాజిల్లుతూ వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష, పరోక్ష జీవనోపాధిని అందిస్తోంది. నాడు సంప్రదాయ అడ్డాకులతోనైనా, నేడు పేపరు ప్లాస్టిక్‌తోనైనా విస్తరాకుల తయారీలో మేమే టాప్, మాకు మేమే సాటి అంటున్నారు కొత్తకోట వాసులు. మీరు విందుకు రెడీ అయితే మేము విస్తరాకులు సరఫరాకు సిద్ధం అంటున్నారు.

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామం విస్తర్లు తయారీలో ప్రసిద్ధి చెందింది. గ్రామంలో నిత్యం విస్తర్లు తయారీ, వాటి క్రయవిక్రయాలతో వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఒకపుడు అడ్డాకుల విస్తర్ల తయారీ అయినా, నేడు వివిధ రకాల ప్లాస్టిక్ ప్లేట్స్ మార్కెట్లోకి వచ్చినా, వాటి తయారీ పోటీలో తామేమీ తీసిపోమన్నట్లు కొత్తకోట ముందంజలో ఉంది. అడ్డాకుల విస్తర్ల తయారీలో చూపించిన సాంకేతిక నిపుణతను, అదే జోరును ప్లాస్టిక్ విస్తర్ల తయారీలోనూ, వాటి క్రయ విక్రయాలులోనూ స్థానిక మహిళలు చూపించడం ఆదర్శనీయం.

ప్రస్తుతం ప్లాస్టిక్ విస్తర్లు తయారీలో కొత్తకోటలోని వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, పుల్లా నాని ఎంటర్‌ప్రైజెస్, చేపూరి ప్లాస్టిక్ విస్తర్ల తయారీ, దేవా ప్లాస్టిక్ విస్తర్లు తయారీ కంపెనీలు దూసుకుపోతున్నాయి. ప్లాస్టిక్ విస్తర్లు తయారీకి కావలసిన యంత్రాలను చెన్నై, బెంగళూర్,హైదరాబాద్, పూణే వంటి పట్టణాల నుంచి దిగుమతి చేసుకుని నెలకొల్పిన స్థానికులు, ప్లాస్టిక్ విస్తర్లు తయారీకి కావలసిన ముడిసరుకు క్రాఫ్ట్ పేపర్, అట్ట బండిల్స్ వంటి వాటిని యానాం, బొబ్బిలి, రాజామహేంద్రవరం, రాజానగర్ తదితర ప్రాంతాల్లోని పేపర్ మిల్లు నుంచి కొనుగోలు చేస్తారు. వీటితో తయారైన ప్లాస్టిక్ విస్తర్లును ప్రముఖ పుణ్య క్షేత్రాలతో పాటు పలు పట్టణాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులు కొనుగోలు చేసిన ముడి సరుకులకు



ప్రభుత్వానికి రూ.లక్షకు సుమారు 12 శాతం పన్ను చెల్లిస్తున్నారు. విస్తర్ల తయారీ కుటీర పరిశ్రమగా వెలుగొందుతూ, ప్రసిద్ధి చెందడంతో స్థానిక బ్యాంకుల నుంచి వీరికి రుణాలిచ్చి ప్రోత్సాహిస్తున్నారు.

**నాడు అడ్డాకుల విస్తర్ల తయారీలోనూ టాప్**

ఒకపుడు అడ్డాకుల విస్తర్ల తయారీలోనూ కొత్తకోట టాప్‌లో ఉండేది. వేలాది మంది మహిళలు వీటి ద్వారా ఉపాధి పొందేవారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, అన్నవరం, చింతపల్లి తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి సేకరించిన, కొనుగోలు చేసిన అడ్డాకులతో ఇంటి వద్దనే కుటుంబం మొత్తం విస్తర్లు తయారీలో నిమగ్నమయ్యేవారు. వాటిని క్రయ విక్రయాలు చేస్తూ, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం ద్వారా జీవనోపాధి పొందేవారు.

**పేపరు ప్లేట్ల తయారీ పోటీలో ధీటుగానే....**

కాలక్రమేణా అడ్డాకుల విస్తర్లు వాడకం తగ్గి, ప్లాస్టిక్, పేపరు ప్లేట్లు వాడకంలోకి వచ్చినప్పటికీ, తామేమీ తీసిపోమన్నట్లు కొత్తకోట మహిళలు ఈ పోటీలోనూ నిలబడ్డారు. ఏమాత్రం దిగులు చెందకుండా, అడ్డాకులతో విస్తర్లు తయారీలో ఉన్న నైపుణ్యాన్ని పేపరు, ప్లాస్టిక్ ప్లేట్లు తయారీవైపు మళ్లించి శభాష్ అనిపించుకుంటున్నారు. పేపరు, ప్లాస్టిక్ విస్తర్లు తయారీ కోసం ఏర్పాటైన వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్, నాని ప్లాస్టిక్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీల్లో 200 మందికి పైగా మహిళలు ఉపాధి పొందుతున్నారు. అధికంగా యంత్రాలతో విస్తర్లు తయారీ కావడంతో టెక్నీషియన్స్‌కు మాత్రమే పని దొరుకుతోంది. పేపరు ప్లేట్‌లను కట్టలుగా కట్టెందుకు మాత్రమే మహిళల సేవలను వినియోగించు కుంటున్నారు. పెళ్లిళ్ల, శుభకార్యాల సమయంలో లాభసాటిగా ఉండే, ఈ వ్యాపారం అన్‌సీజన్ సమయంలో మాత్రం వ్యాపారులు, కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

## సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలో సరుగుడు సాగుపై రైతుల ఆసక్తి చూపుతున్నారు. ప్రతి గ్రామంలోనూ వందలాది ఎకరాల్లో సరుగుడు సాగు కనిపిస్తోంది. ఒకవైపు ఆహార పంటలైన వరి, పప్పు ధాన్యాలు తదితర పంటలు గిట్టుబాటు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరా వరి పంటను సాగు చేయాలంటే రూ.25 వేల నుండి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుండడం, పెట్టుబడికి తగిన విధంగా ఆదాయం లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా సరుగుడుపై ఆసక్తి చూపుతున్నారు. చెరకు సాగు సైతం మండలంలో తగ్గిపోయింది. చెరకు కూడా గిట్టుబాటు కాకపోవడం, పెట్టుబడి శ్రమ ఎక్కువగా ఉండడంతో చెరుకు సాగును రెండుమూడేళ్ల నుండి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం మండలంలో నాలుగు నుండి ఐదువేల ఎకరాల్లో సరుగుడు సాగు చేపడుతున్నారు. ఒకసారి నాటితే ఐదేళ్లపాటు ఎటువంటి పెట్టుబడి లేకుండా సరుకుడు దిగుబడి వస్తుండడంతో రైతుల ఆసక్తి చూపుతున్నారు. గత కొంతకాలంగా మండలంలో గల గ్రామాల్లో వందలాది ఎకరాల్లో సరుగుడు నాటుతున్నారు. ప్రస్తుతం సరుగుడు పంట, ధర ఆశాజనకంగా ఉండడంతో వర్షాకాలంలో నాటుతున్నారు. అలాగే పల్లపు ప్రాంతమైన మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది, చిన్నప్పన్నపాలెం పోలేపల్లి (కస్పా) పొలాల్లో వరి పంటకు గ్యారెంటీ ఉంటుంది. ఈ పొలాల్లో ఖరీఫ్ రబీ సీజన్లలో పంటలు పండుతాయి. మండలంలో గల పలు గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల వారు సైతం కస్పా ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసుకుని పంటలు పండించుకుంటూ ఉంటారు. అలాంటి పరిస్థితి నుండి ఈ పొలాల్లో సైతం సరుగుడు సాగు కనిపిస్తోంది.




అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
జె.నారాయణరావు హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి. బాయ్స్ హాస్టల్ చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
కె.శైలజ హెచ్.డబ్ల్యు.ఒ.
G.T.W.P.M.Girls
కాలేజీ హాస్టల్-అంకుపాలెంరోడ్, చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ఆర్.చిన్నయ్య హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి.బాలుర వసతి గృహం-తురువోలు గ్రామం
చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
వి.కనకేశ్వరి హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి.గర్ల్స్ హాస్టల్-అన్నవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
కె.లలిత హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి.బాలికల హాస్టల్-చీడికాడ
చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
పి.పార్వతి హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి. గర్ల్స్ హాస్టల్, గోవాడ
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
జి.వెంకటరమణ హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి.బాయ్స్ హాస్టల్-గోవాడ
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
జి.వరలక్ష్మి హెచ్.డబ్ల్యు.ఒ.
ఎస్.సి. గర్ల్స్ కాలేజీ హాస్టల్
చీడికాడ రోడ్, చోడవరం
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి అడుగిడిన
ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ఇ.పావని
మండల వ్యవసాయశాఖాధికారిణి (ఎ.)
చోడవరం,
చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

అభ్యుదయభావాలతో..అక్షర సత్యాలతో
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో 45వ వసంతంలోకి
అడుగిడిన ప్రజాశక్తి దినపత్రికకు హృదయపూర్వక శుభాకాంక్షలు
ఎం.బి.శ్రీరామమూర్తి హెచ్.డబ్ల్యు.ఒ.
బి.సి.బాయ్స్ హాస్టల్-వి.మాడుగుల
వి.మాడుగుల మండలం, అనకాపల్లి జిల్లా.

# రైతన్నలకు అన్నపూర్ణ 'కల్యాణపులోవ'



కల్యాణపులోవ రిజర్వాయర్

ప్రజాశక్తి -కొత్తకోట

అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలోని గుడివాడ గురునాథరావు కల్యాణపులోవ జలాశయం అన్నదాతల పాలిట అన్నపూర్ణగా నిలుస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేలకు పైగా ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తూ, రైతుల పాలిట జీవనాడిగా విరాజిల్లుతోంది. అంతేకాక మరో 200లకు పైగా మత్స్యకార కుటుంబాలకు చేపల వేట ద్వారా జీవనోపాధిని కల్పిస్తోంది. వేల ఎకరాలకు సాగునీరు అందజేస్తున్న కల్యాణపులోవ రిజర్వాయర్ సుమారు 120 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో విస్తరించి ఉంది. చుట్టూ కొండలు, ప్రకృతి అందాలతో జలాశయం పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తోంది.

అనకాపల్లి జిల్లాలో ప్రధాన సాగునీటి వనరులలో ఒకటైన కల్యాణపులోవ జలాశయం రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారులో ఉంది. ఈ జలాశయాన్ని 1965-75 మధ్య కాలంలో నిర్మించారు. దీని పూర్తిస్థాయి నీటి మట్టం 460 అడుగులు ఉంది. సుమారు 4,484 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందజేస్తోంది. చీమలపాడు కొత్తపట్నం, గంపవానిపాలెం, దొండపూడి, కొత్తకోట, టి.అర్జాపురం, మర్రివలస, కన్నంపేట, వమ్మవరం, పి.పొన్నవోలు, రోలుగుంట మండలం దిబ్బలపాలెం, జగ్గంపేట, తదితర గ్రామాల్లోని పంటపొలాలు ఈ రిజర్వాయర్ నీటితోనే సస్యశ్యామలమౌతున్నాయి.

ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ జలాశయం ప్రకృతి అందాలకు నెలవుగా అలరిస్తూ, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏటా మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్ల సమయంలో ప్రముఖ పుణ్య క్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా రాష్ట్ర స్థాయిలో పేరొందింది. ఈ జాతరకు లక్షల మంది భక్తులు హాజరై, పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలో ఉన్న కల్యాణ పోతురాజుబాబు, (శివాలయం) పెద్దింటిమ్మ అమ్మవార్ల ఆలయాలలో మొక్కులు చెల్లించుకుంటారు.

రావికమతం మండలం కొత్తకోటలోని భీమునిపట్నం -నర్సీపట్నం (బిఎన్) రోడ్డుకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ జలాశయం ఉంది. రిజర్వాయర్ నిర్మాణానికి ముందు, మండలంలో కరువు విలయతాండవం చేసేదని స్థానికులు చెబుతుంటారు. వేలాది ఎకరాల భూములకు సాగునీరు లేక, పంటలు పండక కరువు, కాటకాలతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొనేవని చెబుతారు. అటువంటి పరిస్థితుల్లో ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నేరవెర్చేందుకు కొత్తకోటకు చెందిన కొందరు పెద్దలు కోట నారాయణదొర, శీలం రాజారావు తదితరుల విన్నపాల మేరకు తంగేడు రాజులు కృషి ఫలితంగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు తదితరులు ప్రాజెక్టు పనులను చేపట్టి, అనతి కాలంలోనే నిర్మించారు.

**కాలువల ఆధునీకరణకు కృషి చేసిన బలిరెడ్డి**

రిజర్వాయర్ నిర్మించిన దాదాపు 18 ఏళ్ల తర్వాత 1993లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చిన్నతరహా నీటి పారుదల శాఖామంత్రిగా ఉన్న కీర్తిశేషులు బలిరెడ్డి సత్యారావు, అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డిని ఒప్పించి జలాశయం ఎడమ ముఖ్య కెనాల్‌తో పాటు సుమారు 13 కిలోమీటర్ల మేర పంట కాలువల నిర్మాణం, వాటికి సిమెంట్ లైనింగ్‌తో పటిష్టపరిచి, ఆధునీకరణ పనులకు సుమారు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయించారు. శివారు భూములకు సాగు నీరు అందటం లేదనే రైతుల అభ్యర్థన మేరకు, ఆయన కృషి చేసి, ఆయకట్టు రైతులకు లబ్ధి చేకూర్చేలా పంట కాలువలను అభివృద్ధి చేశారు. 2004లో చోడవరం ఎమ్మెల్యేగా ఎన్నికైన గంటా శ్రీనివాసరావు నిర్మాణ పనులు చేపట్టి సిమెంట్ లైనింగ్‌తో ఆధునీకరణ చేసి ప్రారంభించారు.

**పాలకుల నిర్లక్ష్యంతో గడ్డు పరిస్థితుల్లో రిజర్వాయర్**

కల్యాణపులోవ ప్రధాన రిజర్వాయర్‌తోపాటు పంట కాలువలకు సరైన నిర్వహణ లేకపోవడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని గడ్డు పరిస్థితిని నేడు రిజర్వాయర్ ఎదుర్కొంటోంది. జలాశయం గట్టు, ప్రధాన పంట కాలువలు చీమలపాడు, కొత్తపట్నం గ్రామాల సమీపంలో అక్కడక్కడా గండి పడడంతో సాగునీరు వృథాగా పోతోంది. కాలువల్లో తుప్పలు, మట్టి పూడిక పేరుకుపోయి శివారు భూములకు తొందరగా సాగునీరు చేరడం లేదు. 2022లో కొత్తపట్నం వద్ద గండి పడి నీరు వృథా కాగా, 2023లో చీమలపాడు వద్ద గండి పడింది. దీంతో కొన్ని రోజులు పాటు నీటి విడుదలను నిలుపుచేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గండ్లు పూడ్చి, పూడిక తొలగింపునకు సుమారు రూ.కోటి నిధులు అవసరమని జలాశయం అధికారులు నాడు అంచనా వేశారు. ప్రభుత్వం, పాలకులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**పర్యాటకంగా అభివృద్ధి శూన్యం**

అన్ని వనరులు ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా కల్యాణపులోవ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. సహజసిద్ధమైన కొండలు, వాటి నుంచి జాలువారే జలపాతాలు, జీవనదులు చూపరులను ఆకర్షిస్తూ ఉంటాయి. ప్రతి ఏటా మహా శివరాత్రి జాతర సందర్భంగా ఇక్కడ మూడు రోజుల పాటు తిరునాళ జరుపుతారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. జలాశయం వద్ద స్నానపుఘట్టాలు మినహా, ఎటువంటి వసతులు లేవు. గట్టుపై విద్యుత్ సదుపాయం లేదు. భక్తుల విశ్రాంతికి వసతి గదులు లేవు. మహా శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా వచ్చే లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వం ఖజానాకే జమ అవుతోంది. ఇక్కడ సౌకర్యాల కల్పనకు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. కరణం ధర్మశ్రీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన చొరవతో ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అందజేసిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.50 లక్షలతో ముఖద్వార మండపం నిర్మించారు.

ఈ జలాశయం వద్ద కార్తీక మాసంలో పర్యాటకులతో సందడి ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే... జలాశయం గట్టుపై విద్యుత్ దీపాలు, బోటు షికార్, ప్రమాద హెచ్చరిక సైరన్ ఏర్పాటు చేయాలి. ఆలయ ఆవరణలో పార్క్‌తో పాటు పర్యాటకుల విశ్రాంతికి కాటేజీలు నిర్మించాల్సిన అవసరం ఉంది. కల్యాణపులోవ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు కల్యాణపు జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గతంలో చాలా ప్రయత్నాలు చేశారు. అప్పట్లో నిధులు సమస్య కారణంగా చేయలేక పోయారు. ఇప్పటికైనా దీని అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

- వేలాది ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు
- వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి
- పాలకుల నిర్లక్ష్యంతో నేడు గడ్డు పరిస్థితి
- పర్యాటకంగా అభివృద్ధికి అవకాశాలు















# వ్యవసాయమే జీవనాధారం




**(మొదటి పేజీ తరువాయి..)** పండించే స్థితి లేదు. కేవలం సరుగుడు, పప్పు ధాన్యాలకే పరిమితమవుతున్నాయి. బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో విభిన్నంగా ఎర్రనేలలు ఉన్నా నీటి వనరులు అందుబాటులో లేక పంటలు పండని స్థితి ఉంది.

ఈ రెండు నియోజకవర్గాల్లో చిన్నాపెద్దా కలిపి 8 రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారుగా 60 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ప్రధానంగా మాడుగుల మండలంలో ఎక్కడా లేని విధంగా 5 రిజర్వాయర్లు ఉన్నాయి. ఈ మండలంలో ఉన్న పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, పాలగెడ్డ, గొర్రిగెడ్డ రిజర్వాయర్లతో పాటు చీడికాడ మండలంలో కోనాం, దేవరాపల్లి మండలంలో రైవాడ, రావికమతం మండలంలో కల్యాణపులోవ జలాశయాలు ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు రిజర్వాయర్లలోని నీటిని వృథాగా వదిలేయడమే ఇక్కడ ఎక్కువగా కనిపిస్తుంది. వీటికి తగ్గ కాలువలు లేకపోవడమే దీనికి కారణం. దీంతో రిజర్వాయర్ల కిందనున్న ఎన్నో చెరువులకు నీరు అందకుండా పోతోంది. రైవాడ రిజర్వాయర్ నీటిని విశాఖ నగరానికి తీసుకుపోతుండడంతో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లోగల మెట్ట ప్రాంత భూములకు నీరు అందకుండా పోతోంది. అయితే జిల్లాలో మిగిలిన ప్రాంతాలతో పోల్చుకుంటే చోడవరం, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల మండలాలకు సాగునీటి సౌకర్యం చాలా మెరుగ్గా ఉంది. సాగునీరు అందుబాటులో ఉండడంతో వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా రైతులు దీనిని వదులుకోలేకపోతున్నారు. ప్రధాన ఆహార పంటగా వరి, వాణిజ్య పంటగా చెరకు పండిస్తారు. చెరకును అధిక మొత్తంలో చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందివ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసినా ఆచరణ రూపం దాల్చలేదు. వ్యవసాయం అంతగా గిట్టుబాటు కాకపోవడంతో వాణిజ్య పంటలవైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఈ ప్రాంతంలో అపారమైన గ్రానైట్, ఇసుక నిక్షేపాలు ఉన్నాయి. మాడుగుల మండలంలో సీతలబంద, వేరాడ, ఎరుకువాడ, వీరనారాయణం, వమ్మలి, జగన్నాథపురం, చింతలూరు, రావికమతం మండలంలో గుడ్డిప, కవగుంట, కొమిర, డోలవానిపాలెం, రామన్న పాలెం, బుచ్చెయ్యపేట మండలం రాజాంలో తెల్లరాయి గ్రానైట్, చోడవరం మండలంలో బెన్నవోలు వద్ద సుద్ధ క్వారీలు ఉన్నాయి.

ఆయా ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల నుంచి తవ్వకాలు చేస్తున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో సుమారు 40 వరకు ఇసుక రీచ్‌లు ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం రాజాం, చిట్టియ్యపాలెం, తైపురం ప్రాంతాల్లో అబ్రకం, చింతపాక, గున్నెంపూడి ప్రాంతాల్లో రంగురాళ్లు ఉన్నాయి. రోలుగుంట, దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో నిర్మాణానికి ఉపయోగించే నల్లరాతి ఖనిజాలు ఉన్నాయి. మాడుగుల కేంద్రంగా ఏజెన్సీ వ్యాపారం సాగుతోంది.

**గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాల లేమి**

ఈ రెండు నియోజకవర్గాల్లో 102 గ్రామాల్లో 40 వేల మంది వరకు గిరిజనులు జీవిస్తున్నారు. ఈ గిరిజన గ్రామాలను రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌లో చేర్చకపోవడంతో వీరికి ఐటిడిఎ నుంచి ఎటువంటి సౌకర్యాలూ అందడం లేదు.







